Follow: @ANNTELUGU

29-04-2025

# మహా పత్రిక

ANN తెలుగు

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 147 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# ఢిల్లీలో హైటెన్షన్

## ప్రధాని మోదీ వరుస భేటీలు

**ఢిల్లీ, మహా:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఢిల్లీలో జరుగుతున్న వరుస భేటీలు ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశమైన గంటల వ్యవధిలోనే పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ భేటీ అయ్యింది. ఈ సమావేశాల్లో పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రత సన్నద్ధతపై చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్రం సీరియస్ గా పాకిస్థాన్ పై ముప్పేటదాడికి సీరియస్ వ్యూహరచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

టాప్ న్యూస్

## కేసీఆర్ స్వరంలో భయం



- హరీష్ ఓ కరివేపాకు..
- బీఆర్ఎస్ మీటింగ్ పై ఎంపీ రఘునందన్ సెటైర్లు
- రూ.350 కోట్లతో సభ

03

## ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి



- తక్షణమే మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

02

## రేవంత్‌రెడ్డి వెన్నంటి ఉన్న కేసీఆర్



- ప్రభుత్వానికి కేసీఆర్ సపోర్ట్ చేస్తున్నారు
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

03

# పండుగలా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

## పద్మవిభూషణ్ అందుకున్న డా.నాగేశ్వర్ రెడ్డి

పద్మభూషణ్ అందుకున్న నందమూరి బాలకృష్ణ

తెలుగు వారి సంప్రదాయ పంచెకట్టులో రాష్ట్రపతి భవన్ కు బాలయ్య



**ఢిల్లీ, మహా :** దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం పండుగలా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సాయంత్రం ఈ అవార్డులను అందజేసి గ్రహీతలను గౌరవించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విభాగంలో పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, కళా రంగంలో పద్మభూషణ్‌కు ఎంపికైన సినీ నటుడు బాలకృష్ణ, పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ విశిష్ఠ పౌర పురస్కారాలను అందుకున్నారు. అలాగే, సినీ నటుడు అజిత్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తదితరులు 'పద్మ' అవార్డులను అందుకున్నారు.

మిగతా 2లో

## కేటీఆర్‌కు వెన్నుపూసలో గాయం




- జిమ్ లో వర్కౌట్ చేస్తుండగా.. ఘటన
- బెడ్ రెస్ట్ తీసుకోవాలన్న వైద్యులు

వివరాలు 2లో

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

## కేసీఆర్ ప్రసంగంలో పస లేదు..

## రాజకీయ ప్రతీకారాలకు నేను దూరం



మరో 20 ఏళ్ళు రాజకీయాల్లో ఉంటా.. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి

ప్రజల్లో ఉంటేనే పదవులు.. కొందరు ఎమ్మెల్యేలు హైదరాబాద్ కే పరిమితమవుతున్నారు

పార్టీలో ఓపికగా ఉంటే పదవులు.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నష్టపోతారు

మీడియా ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాము రాజకీయ ప్రతీకారాలకు దూరం అని స్పష్టం చేసారు. కేసుల విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళ్తామన్నారు. రాహుల్ గాంధీ తో తనకు ఉన్న సత్సంబంధాలు ఏమిటన్నది తమకు తెలుసని ఈ విషయంలో ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తాను ఎవరికైనా కమిట్‌మెంట్ ఇస్తే పూర్తి చేస్తానని చెప్పిన రేవంత్, తన భవిష్యత్ లక్ష్యాలను స్పష్టం చేశారు. సోమవారం తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, కీలక అంశాలపైన స్పందించారు. ఇందిరా గాంధీ తెగువను గుర్తు చేసుకున్నారు. ఒక దేశాన్ని ఓడించి చరిత్రలో నిలిచారన్నారు. వరంగల్ బీఆర్ఎస్ సభలో కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్ల గక్కారని వ్యాఖ్యానించారు. ''కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు

**కగార్ పై పార్టీ నిర్ణయమే ప్రభుత్వ నిర్ణయం**

కగార్‌పై తమ పార్టీ నిర్ణయం తీసుకున్నాక ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని సీఎం రేవంత్ అన్నారు. ప్రపంచంలో ఇంధిరా గాంధీకి మించిన యోధురాలు లేరని ప్రశంసించారు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఇందిరాగాంధీకే దక్కుతుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.

మిగతా 2లో

## 48 గంటల్లో పొలాలు ఖాళీ చేయండి

పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ సూచన

భీకర యుద్ధం తథ్యమా...?

వివరాలు 3లో

## సారీ చెప్పేందుకు మాటల్లేవు

- ఉగ్రదాడిని అందుకు వాడుకోను
- తుపాకులతో ఉగ్రవాదాన్ని నియంత్రించగలం కానీ అంతం చేయలేం
- కానీ ప్రజలు మనతో ఉన్నప్పుడే అంతమవుతుంది
- ఒమర్ అబ్దుల్లా కామెంట్స్

వివరాలు 2లో

# భూ భారతి రైతులకు శ్రీరామరక్ష

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**అశ్వారావుపేట, ఏప్రిల్ 28, మహా:** భూ భారతి చట్టంలో ప్రతి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇది నాలుగు గోడల మధ్య తయారుచేసిన స్వార్థపూరిత చట్టం కాదని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన భూ భారతి2025 చట్టంపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**రైతుల కష్టాలపై కమిటీ అధ్యయనం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రైతుల సమస్యలు, భూముల గల్లంతు పరిస్థితులను గమనించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మిగతా 2లో




# తెలంగాణకు మొదటి చివరి విలన్ కేసీఆర్

## సభలో జనాలకంటే ఎక్కువగా విస్కీ బాటిల్స్

హరీష్, కవితకు అవమానం.. ఆ రికార్డు కేసీఆర్ ఫ్యామిలీదే

చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తా? ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సభ వేదికపై కేసీఆర్, హరీష్ రావు ఫోటోలు లేకుండా చేసి వారిని అవమానించారని, దీంతో వారి మనసుకు మరోసారి గాయమైందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్ గా మారిందని, దేశ చరిత్రలో అతి తక్కువ కాలంలో ఎక్కువ దోచుకున్న కుటుంబం కేసీఆర్ ది అని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్ లో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 15 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, టైం వేదిక మీరే డిసైడ్ చేయండి చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తా? ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్ అంటూ ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ అట్టర్ ప్లాప్ అయిందని, తెలంగాణకు మొదటి చివరి విలన్ కేసీఆర్ అని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆ సభలో జనాలకంటే ఎక్కువ విస్కీ బాటిల్స్ ఉన్నాయని ఎద్దేవా చేశారు. సభలో మహిళలు



కనిపించలేదని అన్నారు.

**కేసీఆర్ శకం ముగిసింది**

వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగంలో పసలేదన్న ఆయన కేసీఆర్ శకం ముగిసిందన్నారు.

మిగతా 2లో

## రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం

### ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం

డిండి ఎత్తిపోతల పథకాన్ని చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం

మూసీ ప్రాజెక్టుకు నల్లగొండ ముక్తకంఠంతో మద్దతిస్తోంది

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట

నల్లగొండలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మంత్రి కోమటిరెడ్డితో కలిసి పలు శంకుస్థాపనలు

02



## రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ సంస్థాగత భేటీలు

### బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి చర్యలు

- కష్టపడే వారికే పదవులు.. జెండామోసేవారికే గుర్తింపు
- ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు తాహెర్ బిన్ హందన్, చిట్ల సత్య నారాయణ
- సభకు అధ్యక్షత వహించిన కంది శ్రీనివాస రెడ్డి



05

## Z కేటగిరీ

## రజతోత్సవం పేలని బాంబు!

వివరాలు 4లో

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

(మొదటిపేజీ తరువాయి)
మాజీ సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతారని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన స్కీంలు ఏ రాష్ట్రంలో అమల్లో లేవని తెలిపారు. ఎన్నికలకు చివరి 6 నెలలు తన పాలనపై చర్చ జరుగుతుందన్నారు. నిన్నటి వరంగల్ సభలో మాజీ సీఎం కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారని విమర్శించారు. పిల్లగాళ్లు అని కేసీఆర్ అన్నారంటూ మరి వారినెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ స్పీచ్‌లో పస లేదని విమర్శించారు. సంవత్సరన్నర నుంచి పథకాలు తీసుకొచ్చామని, ఇప్పుడు వాటన్నింటిని సమీక్షిస్తున్నామన్నారు. తాను ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను చట్టప్రకారమే నడుచుకుంటానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తప్పు చేసిన నేతలను అరెస్ట్ చేయమని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని రేవంత్ చెప్పుకొచ్చారు.

**హైదరాబాద్ లో ఉండే ఎమ్మెల్యేలపై ఆగ్రహం**

తాను కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానని అన్నారు. గతంలో అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పానని, అలాగే ఆయనకు ఇప్పించానని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పుకోవడంలో కొంత వెనకబడ్డామని, స్పీడప్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని స్ట్రీమ్ లైన్ చేశామన్నారు. ఆప్షన్ లేకనే కొంతమంది అధికారులను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉన్నపళంగా తీసేస్తే పాత విషయాలన్నీ తెలిసేది ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఎమ్మెల్యేల పని తీరుపై రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేసారు. నియోజకవర్గాల్లో తిరగమంటే కొందరు ఎమ్మెల్యేలు హైదరాబాద్ లో ఉంటున్నారని సీరియస్ అయ్యారు. ఎమ్మెల్యే అయ్యాక మనోడు.. మందోడు ఉండదని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని రేవంత్ తేల్చి చెప్పారు. "ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు" అని రేవంత్ మరోసారి హెచ్చరించారు.

# సారీ చెప్పేందుకు మాటల్లేవు

## ఉగ్రదాడిని అందుకు వాడుకోను

తుపాకులతో ఉగ్రవాదాన్ని నియంత్రించగలం కానీ అంతం చేయలేం
కానీ ప్రజలు మనతో ఉన్నప్పుడే అంతమవుతుంది
ఒమర్ అబ్దుల్లా కామెంట్స్



**మహా :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో సోమవారం సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక ప్రసంగం చేశారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన సీఎం ఈ దాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాల్ని, భవిష్యత్తులో చోటు చేసుకోబోయే పరిణామాల్ని కూడా వెల్లడించారు. ఉగ్రదాడిపై దేశం ఏకమైందని, దీంతో కాశ్మీర్ లోయలో ఉగ్రవాదానికి ముగింపు పడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రదాడిని అడ్డుపెట్టుకుని కేంద్రాన్ని రాష్ట్ర హోదా డిమాండ్ చేయలేనన్నారు. దేశంలోని ప్రతి ప్రాంతం, ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పడమర వరకు, ఈ దారుణమైన చర్యతో బాధపడిందని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఈ దాడికి వ్యతిరేకంగా కాశ్మీర్ మొత్తం ఐక్యంగా ఉందని, ఇది లోయలో ఉగ్రవాదం ముగింపుకు నాంది కావచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లాకూ, ప్రభుత్వానికి విపక్ష బీజేపీ నుంచి మద్దతు లభించింది. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను విపక్ష నేత సునీల్ శర్మ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మంది బాధితుల పేర్లు, రాష్ట్రాలను సీఎం ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీలో చదివి వినిపించారు. జమ్మూ కాశ్మీర్ ఇటువంటి దాడుల వెనుక ఉందని భారత దేశం మొత్తం భావించడం ప్రారంభించిందని సీఎం తెలిపారు. దురదృష్టవశాత్తు తదుపరి దాడి ఎక్కడ జరుగుతుందో అని అనిపించే పరిస్థితిని ఇది కల్పించిందన్నారు. బాధితుల కుటుంబాలకు క్షమాపణ చెప్పడానికి తనకు మాటలు లేవని అబ్దుల్లా గుర్తు చేసుకున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత ఎన్నికైన ప్రభుత్వం కింద లేదని ఒమర్ గుర్తు చేశారు. కానీ ముఖ్యమంత్రిగా, పర్యాటక మంత్రిగా, తను పర్యాటకుల్ని ఇక్కడికి స్వాగతించానని ఒమర్ తెలిపారు. వారిని తిరిగి సురక్షితంగా పంపడం తన బాధ్యతే అని అన్నారు. తాను అది చేయలేకపోయానన్నారు. క్షమాపణ చెప్పడానికి తన దగ్గర మాటలు లేవన్నారు. రక్తంతో తడిసిన తమ తండ్రులను చూసిన ఆ పిల్లలకు, రోజుల క్రితం వివాహం చేసుకున్న ఆ నేవీ అధికారి వితంతువుకు తానేం చెప్పగలనంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వారు తమ తప్పు ఏమిటని అడిగారని, వారు మొదటిసారి కాశ్మీర్‌కు వచ్చామని, ఆ సెలవుదినానికి జీవితాంతం మూల్యం అనుభవిస్తామని చెప్పారన్నారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు కాశ్మీర్ కోసం దీన్ని చేశారని చెప్పుకున్నారని, కానీ వాళ్లను తాము ఇది అడిగామా అని సీఎం ఒమర్ ప్రశ్నించారు. ఈ 26 మందిని తమ పేరుతో శవపేటికలలో తిరిగి పంపాలని తాము చెప్పామా అని అడిగారు. తాము దీనికి అంగీకరించామా? అన్నారు. తమలో ఎవరూ ఈ దాడికి మద్దతు ఇవ్వడం లేని, ఈ దాడి తమను షాక్‌కు గురిచేసిందన్నారు. రెండు దశాబ్దాలకు పైగా జమ్మూ కాశ్మీర్‌లో ఇంత పెద్ద ఎత్తున దాడికి వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి రావడం ఇదే తొలి అన్నారు. కతువా నుండి కుప్వారా వరకు, దీనికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేయని పట్టణం లేదా గ్రామం లేదన్నారు. ప్రజలు ప్రభుత్వాలకు అండగా ఉన్నప్పుడు ఉగ్రవాదం అంతమవుతుందని ఒమర్ తెలిపారు. ఇది ఒక అవకాశానికి నాంది అన్నారు. మనం జాగ్రత్తగా ఉండాలని, ప్రజలను మన నుండి దూరం చేసే ఏ పని చేయకూడదని తెలిపారు. ఈ ఆకస్మిక నిరసనను దెబ్బతీసే ఎటువంటి చర్య తీసుకోకూడదన్నారు. తుపాకులతో మనం ఉగ్రవాదాన్ని నియంత్రించగలమని, కానీ దానిని అంతం చేయలేమన్నారు. ప్రజలు మనతో ఉన్నప్పుడు అది అంతం అవుతుందన్నారు. ఒక పర్యాటకుడిని రక్షించడానికి ప్రయత్నించి ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన ధైర్యవంతుడైన గుర్రపు బండి నడిపే వ్యక్తి సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా గురించి ప్రస్తావిస్తూ, అందరూ తన ప్రాణాలకు భయపడుతున్నారని, కానీ అతను పర్యాటకుల కోసం, మన అతిథుల కోసం తన ప్రాణాలను త్యాగం చేశాడని ప్రశంసించారు. అతను పారిపోయి ఉంటే ఎవరు ప్రశ్నించేవారన్నారు. కానీ పారిపోయే బదులు, అతను ప్రమాదం వైపు వెళ్ళాడని, ఇలాంటి కథలు మనం చాలా వింటున్నామన్నారు. ప్రజలు గాయపడిన వారిని తమ భుజాలపై మోసుకు వెళ్లారని, స్థానికులు పర్యాటకులకు సహాయం చేయడానికి ప్రయత్నించారని సీఎం ఒమర్ తెలిపారు. ఒక పేద శికారావల్లా ఉచిత పండ్ల చాట్‌ను అందించాడని, అతను రోజుకు 200300 రూపాయలు సంపాదిస్తాడని గుర్తుచేశారు. క్యాబ్ ఆపరేటర్లు ఉచిత రైడ్‌లు అందించారని, హోటల్ యజమానులు వారి గదులను తెరిచారని, తాను వారికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. తాము ఇలాగే ఆతిథ్యం ఇస్తున్నామన్నారు.

# భూ భారతి రైతులకు శ్రీరామరక్ష

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



(మొదటిపేజీ తరువాయి)
ఆ కమిటీ సూచనల ఆధారంగా భూ భారతి చట్టాన్ని రూపొందించినట్టు చెప్పారు. గతంలో ధరణి చట్టాన్ని నాలుగు గోడల మధ్య స్వార్థపూరితంగా తీసుకువచ్చినా, మూడేళ్లైనా నియమాలు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

**జూన్ 2 నాటికి సమస్యల పరిష్కారం**

ప్రస్తుతం నాలుగు మండలాల్లో భూ భారతి చట్టాన్ని ప్రాయోగికంగా అమలు చేస్తూ అన్ని వివరాలు, దరఖాస్తులు సేకరిస్తున్నామని మంత్రి తెలిపారు. జూన్ 2 నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించి, అర్హులైన వారికి ప్రభుత్వ భూములను పట్టాలుగా అందించనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు వివరించారు.

**ఐదంచెల వ్యవస్థ – ట్రిబ్యునల్ అవకాశం**

భూ యజమానులకు న్యాయం జరిగేలా తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఎ వరకు ఐదంచెల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. సీసీఎల్ఎ వద్ద కూడా న్యాయం జరగకపోతే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**తప్పు చేసే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం**

రాష్ట్రంలో వచ్చే నెల 10వ తేదీకి రెవెన్యూ, గ్రామ పరిపాలనా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు. తప్పు చేసే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గతంలో రైతు బంధు కోసం భూమిలేని గులాబీ పార్టీ కార్యకర్తలకు కూడా పట్టాదారు పత్రాలు ఇచ్చిన దుర్మార్గాన్ని గుర్తు చేశారు. ఇకపై అటువంటి అక్రమాలకు తావు ఉండదని హెచ్చరించారు. రెవెన్యూ వ్యవస్థను పేదలకు చట్టంలా ఉపయోగపడే విధంగా మలుస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం

## ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం

డిండి ఎత్తిపోతల పథకాన్ని చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం
మూసీ ప్రాజెక్టుకు నల్లగొండ ముక్తకంఠంతో మద్దతిస్తోంది
కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట.. నల్లగొండలో మంత్రి ఉత్తమ్
మంత్రి కోమటిరెడ్డితో కలిసి పలు శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాలు



**నల్గొండ, మహా :** ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలని, కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. "గత కేసీఆర్ ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్ 2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, బీఆర్ఎస్ నేతలు జేబులు నింపుకొన్నారు. బీఆర్ఎస్ నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.

### కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?: కోమటిరెడ్డి

'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదు" అని విమర్శించారు.



# హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

**బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేత**

**మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై నమోదైన కేసును హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత ఈ కేసును జస్టిస్ కె. లక్ష్మణ్ కొట్టివేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి రూ. 2500 కోట్లు పంపించారంటూ కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిన శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. బంజారాహిల్స్ పోలీసులకు పంపారు. దీంతో కేటీఆర్‌పై 504, 505(2) కేసులు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, మున్సిపల్ శాఖను సీఎం రేవంత్ రెడ్డి తన ఆధీనంలో ఉంచుకొన్నారని ఆరోపించారు. ఆయనకు ముడుపులు చెల్లిస్తేనే భవనాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. అలా వసూల్ చేసిన నగదు రూ 2500 కోట్లు ఢిల్లీలోని పార్టీ పెద్దలకు పంపారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత బత్తిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించారు.

# పండుగలా పద్మ అవార్డుల ప్రదానోత్సవం



(మొదటిపేజీ తరువాయి)
ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్‌తో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో నేడు దాదాపు సగం మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. మిగతా వారికి త్వరలో ప్రదానం చేసే అవకాశం ఉంది. నందమూరి బాలకృష్ణకు తొలిసారి పురస్కారం లభించిన నేపథ్యంలో ఆయన కుటుంబమంతా హాజరైంది.

# తెలంగాణకు మొదటి చివరి విలన్ కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)
దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని..నకిలీ గాంధీలు అనడం కేసీఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అనడానికి నిదర్శనం బీజేపీ పై కేసిఆర్ రెండు నిమిషాల ప్రసంగమేనన్నారు. బీసీ కుల గణన ,ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ బిక్షతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాడన్న ఆయన గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ బిక్షతో దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తారన్నారు.

**కుటుంబ కొట్లాట వేగలేక రజతోత్సవ సభ**

పదేళ్లలో మీరు 60 వేల ఉద్యోగాలు ఇస్తే..మేము ఏడాదిలో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కేసీఆర్ కి గుండెల్లో గుబులు మొదలైందని మహేశ్ కుమార్ అన్నారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత ఆడుతున్న మూడు ముక్క లాటతో కేసీఆర్ కి మతి భ్రమించిందన్నారు. కుటుంబ కొట్లాట వేగలేక రజతోత్సవ సభ పేరిట కేసీఆర్ హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీనీ అమలు చేస్తున్నామన్నారు. కేసిఆర్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో విధ్వంసం పాలైందన్నారు. పార్టీ పేరులోంచి తెలంగాణ పదాన్ని తొలగించినప్పుడు కన్నతల్లిని జన్మభూమిని మించిన స్వర్గం లేదనే మాట కేసీఆర్ కి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సెంటి మెంటు ను వాడుకోవడం కేసీఆర్ కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఉద్యమ జెండాను దింపితే రాళ్లతో కొట్టి చంపండి అన్న కేసీఆర్ కు పదేళ్లలో అమరవీరులు త్యాగం, ఉద్యమకారులు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు.అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని దోచుకొని బీజేపీ కి సాగిలపడి రాష్టానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు.



**కేసీఆర్ హయాంలో వడ్ల కుప్పలపై రైతులు ఆత్మహత్యలు**

420 వైఫల్యాలు కేసీఆర్‌వి... ఆయన చేసిన మోసాల గురించి సభలో ఎందుకు చెప్పుకోలేదని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కనీసం ఆలోచన లేకుండా కేసీఆర్ తన కుటుంబం బాగుకోసం కాళేశ్వరం కట్టారని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చిన వారికి ఒక్క పదవి ఇవ్వకపోగా ..తన కుటుంబానికే అన్ని పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు.కేసీఆర్ హయాంలో విద్య, వైద్యం నిర్లక్ష్యం చేయడం వాస్తవం కాదా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో వడ్ల కుప్పలపై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది మర్చిపోయారా అని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ ఎవరివి.. వాటికోసం జీవోలు మార్చారని ఆరోపించారు. కేసీఆర్ పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కే పరిమితం కావాలని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. లాభాల్లో ఉన్న తెలంగాణని 7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ ను ప్రజలు క్షమించరన్నారు.

# ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి

తక్షణమే మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**మహా :** మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తక్షణమే మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు ఆహ్వానించాలని కోరారు. సోమవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని సూచించారు. శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ముందుకు రావాలని అన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకోవాలని, కేవలం చర్చల ద్వారా మాత్రమే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాల్పులతో మావోయిస్టులను అంతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వపు విధానం సరికాదని సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతి చర్చలు నిర్వహించాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ హయాంలో అనేక మంది నక్సలైట్లు సరెండర్ అయ్యారని, కేసీఆర్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్ల చత్తీస్ ఘడ్ నుంచి వచ్చి కూడా తెలంగాణలో నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారని గుర్తు చేశారు. కేసీఆర్ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని, సరెండర్లను ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఆదివాసీలు నలిగిపోతున్నారని, ఎవరు చనిపోయినా కూడా మన దేశ పౌరులే కాబట్టి కేంద్రం చొరవ తీసుకోవాలని తెలిపారు.



### కేటీఆర్‌కు వెన్నుపూసలో గాయం

**జిమ్ లో వర్కౌట్ చేస్తుండగా.. ఘటన**
బెడ్ రెస్ట్ తీసుకోవాలన్న వైద్యులు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గాయపడ్డారు . జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా స్లిప్ డిస్క్ (వెన్నుముకు గాయం) అయింది. దీంతో గాయపడిన కేటీఆర్ వెంటనే డాక్టర్లను సంప్రదించారు. డాక్టర్లు కొన్ని రోజులు బెడ్ రెస్ట్ తీసుకుని కోలుకోవాలని సలహా ఇచ్చారు. తాను త్వరలోనే కోలుకోవాలని ఆశిస్తున్నానని.. త్వరలో కోలుకుని ప్రజల ముందుకు వస్తానని కేటీఆర్ ట్వీట్ లో తెలిపారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్ త్వరగా కోలుకోవాలని ట్వీట్లు చేస్తున్నారు.

# కాల్పులు విరమించి.. శాంతి చర్చలకు పిలవండి

**కేంద్రానికి మావోయిస్టుల లేఖ**



**రాయ్‌పూర్ :** కేంద్రం తమను శాంతి చర్చలకు పిలవాలని కోరుతూ మావోయిస్టులు మరోసారి లేఖ విడుదల చేశారు. కర్రెగుట్టలో 5 రోజులుగా కూంబింగ్ జరుగుతోందని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి చర్చలకు పిలవాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కోరింది. శాంతి చర్చలకు తాము సిద్ధమని గత వారం కూడా లేఖ రాసినట్లు పేర్కొంది. శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణం సృష్టించాలని విజ్ఞప్తి చేస్తూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదలైంది.

# అరగంట కాదు.. మీరు అర్ధ శతాబ్దం వెనుక ఉన్నారు

**మా దేశ సైనిక బడ్జెట్ అంత లేదు మీ బడ్జెట్**

**పాకిస్థాన్ పై ఎంఐఎం అధినేత ఓవైసీ నిప్పులు**

మీరు వేరే దేశంలోకి అమాయకులను చంపితే ఎవరూ ఊరుకోరు

కశ్మీరీలు భారత్‌లో అంతర్భాగం.. వారిని అనుమానించవద్దు

పాక్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని ప్రధాని మోదీకి ఓవైసీ సూచన



**హైదరాబాద్, మహా:** పాకిస్థాన్‌పై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్ కంటే పాకిస్థాన్ అరగంట కాదు, ఏకంగా అర్ధ శతాబ్దం వెనుకబడి ఉందని ఎద్దేవా చేశారు. మహారాష్ట్రలోని ప్రభానీలో వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన బహిరంగ సభలో ఓవైసీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇటీవల పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ నేతల అణుబాంబు బెదిరింపులను ప్రస్తావిస్తూ, "మీరు అరగంట కాదు, అర్ధ శతాబ్దం వెనుకబడి ఉన్నారు. మీ దేశ బడ్జెట్ మా సైనిక బడ్జెట్‌తో కూడా సరిపోదు" అని ఓవైసీ అన్నారు. "పాకిస్థాన్ పదేపదే తమ వద్ద అణుబాంబులు, ఆటం బాంబులు ఉన్నాయని చెబుతోంది. గుర్తుంచుకోండి, మీరు వేరే దేశంలోకి వెళ్లి అమాయక ప్రజలను చంపితే, ఏ దేశం మౌనంగా ఉండదు" అని ఆయన హెచ్చరించారు. పహల్గామ్ లో ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి మరీ హత్య చేశారని ఓవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. "మీరు ఏ మతం గురించి మాట్లాడుతున్నారు? మీరు ఖవారీజ్‌ల కంటే నీచులు. మీ చర్యలు మీరు ఐసిస్ వారసులని చూపిస్తున్నాయి" అని తీవ్రంగా విమర్శించారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఏళ్లుగా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్ వైమానిక దళాన్ని దిగ్బంధించడానికి, వారి ఇంటర్నెట్‌ను హ్యాక్ చేయడానికి అంతర్జాతీయ చట్టాలు భారత్‌కు అనుమతిస్తున్నాయని కూడా ఓవైసీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను ఆర్థికంగా బలహీనపరిచే చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఓవైసీ డిమాండ్ చేశారు. కశ్మీర్ లాగే కశ్మీరీలు కూడా భారతదేశంలో అంతర్భాగమని స్పష్టం చేశారు. "కొందరు టీవీ ఛానల్ యాంకర్లు కశ్మీరీలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వారు సిగ్గులేనివారు. కశ్మీర్ మన అంతర్భాగం అయినప్పుడు, కశ్మీరీలు కూడా మన అంతర్భాగమే. వారిని ఎలా అనుమానిస్తాం?" అని ఓవైసీ ప్రశ్నించారు. ఉగ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు అర్పించింది కశ్మీరీయేనని, గాయపడిన చిన్నారిని తన వీపుపై మోసుకుని 40 నిమిషాలు నడిచి ప్రాణాలు కాపాడింది కూడా కశ్మీరీయేనని ఆయన గుర్తు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టంపై మాట్లాడుతూ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ప్రకటించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 30న 'బత్తీ గుల్' కార్యక్రమంలో భాగంగా లైట్లు ఆర్పివేయాలని కోరారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపినందుకు అజిత్ పవార్, నితీశ్ కుమార్, జయంత్ చౌదరి, చంద్రబాబు నాయుడులపై ఓవైసీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వీరిని ముస్లింలు, లౌకికవాదులు క్షమించరని అన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరోసారి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా తన కుమారుడి రాజకీయ భవిష్యత్తును ఫణంగా పెట్టారని ఓవైసీ విమర్శించారు.

# కేసీఆర్ స్వరంలో భయం

**హరీష్ ఓ కరివేపాకు.. బీఆర్ఎస్ మీటింగ్ పై రఘునందన్ సెటైర్లు**


**రూ.350 కోట్లతో సభ**



**హైదరాబాద్, మహా:** కేసీఆర్ స్వరంలో భయం కనిపించిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కేసీఆర్ నిర్వహించిన రజతోత్సవ సభలో యువత కనిపించలేదన్నారు. డబ్బులు ఇచ్చి జనాన్ని తరలించారని ఆరోపించారు. 350 కోట్లు ఖర్చు పెట్టి నిన్న బీఆర్ఎస్ సభ నిర్వహించిందన్నారు. ఈ మీటింగ్ లో కేసీఆర్ కొత్తగా మాట్లాడింది లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చుట్టాలంతా కోటీశ్వరులయ్యారన్నారు. సిద్దిపేట ప్రాంతానికి రైలు తీసుకొచ్చిన ఘనత మోదీ సర్కార్ కే దక్కిందన్నారు. నిన్నటి మీటింగ్ ద్వారా తన వారసుడు కేటీఆర్ అని కేసీఆర్ స్పష్టం చేశాడన్నారు. హరీష్ రావు బీఆర్ఎస్ లో కూరలో కరివేపాకు లాంటి వాడని ఎద్దేవా చేశారు.

# 48 గంటల్లో పొలాలు ఖాళీ చేయండి

**పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ సూచన.. భీకర యుద్ధం తథ్యమా...?**



**మహా :** పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయింది. త్రివిధ దళాలను రెడీ చేసింది. ఏ క్షణమైనా దాయాది దేశం పాకిస్థాన్ కు బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో48 గంటల్లో జీరో లైన్ వెంబడి పొలాలను క్లియర్ చేయండి అని రైతులకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సూచించింది. సరిహద్దు భద్రతా దళం జీరో లైన్ వెంబడి ఉన్న రైతులకు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. వేలాది మంది పంజాబ్ రైతులు జీరో లైన్ వెంబడి సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో తమ పొలాలను కలిగి ఉన్నారు. వారు పండించిన పంటలు ఇప్పుడు చాలా వరకూ చేతికందాయి. దీంతో వెంటనే పంటను కోసి ఇళ్లకు తెచ్చుకోవాలని, లేదంటే, నిలువెత్తు పంటల్లో విద్రోహులు దాక్కుని దాడి చేసే ప్రమాదముందని సదరు రైతులకు ఇచ్చిన నోటీసుల్లో బీఎస్ఎఫ్ దళం వివరణ ఇచ్చింది.

ఇండియా పాకిస్తాన్ మధ్య 530 కి.మీ పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. దీని వెంబడి దాదాపు 45,000 ఎకరాల భూమిని మన రైతులు సాగు చేస్తున్నారు. అమృత్‌సర్‌లోని రౌడా వాలా ఖుర్ద్‌లోని స్థానిక గురుద్వారా కూడా బీఎస్ఎఫ్ నోటీసుకు సంబంధించి ప్రకటన చేసింది. రౌడా వాలా ఖుర్ద్ మాత్రమే కాకుండా, తర్న్ తరణ్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్ జిల్లాల్లోని గ్రామాలలో ఉన్న గురుద్వారాలు కూడా ఇలాంటి ప్రకటనలు చేశాయి. గురుద్వారా రైతులు వీలైనంత త్వరగా పంటలు కోయాలని కోరుతున్నాయి. ఎందుకంటే యాక్సెస్ గేట్లు త్వరలో మూసివేయబడతాయని ఆయా గురుద్వారాలు సరిహద్దు ప్రాంత రైతులను అప్రమత్తం చేస్తున్నాయి. పొలాల్లో ఏపుగా పెరిగిన పంటలు సరిహద్దులోకి చొరబడటానికి ప్రయత్నించే విద్రోహుల అడుగు జాడల్ని కనిపించకుండా చేస్తాయి. జీరో లైన్ వెంబడి ఉన్న ప్రాంతాలు క్లియర్ గా ఉంటే, కీలకమైన ప్రాంతాల వెంబడి నిఘా పెంచుకునేందుకు మన భద్రతా దళాలకు వీలు చిక్కుతుంది.

# ఆసుపత్రిలో దొంగలు పడ్డారు

**మోటార్ తో సహా, పైపు, కేబుల్ దొంగిలించిన దొంగలు**

వారం రోజులుగా దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తీవ్ర నీటి ఎద్దడి

ఆరోగ్య కేంద్రంలో నీరు లేక బాత్రూంలకు తాళాలు వేసిన వైనం



**మహా :** సాక్షాత్తూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇలాకలోని ఆసుపత్రిలో దొంగలు పడ్డారు. దాంతో ఆసుపత్రిలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోరు బావిలోని సింగల్ ఫేస్ మోటర్, కేబుల్, పైపు తో సహా గత ఆదివారం సెలవు ఉండడంతో సిబ్బంది ఎవరు ఆస్పత్రికి రారానీ గమనించిన దొంగలు మోటార్ తో సహా కేబుల్ వైర్, పైపుతో సహా దొంగిలించుక పోయారు. సోమవారం సిబ్బంది ఎవరు గమనించక పోవడంతో ఈ దొంగతనం కొద్దిగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఆసుపత్రిని సిబ్బందిని వివరాలు అడగగా ఆదివారం రోజు సెలవు కావడంతో ఆసుపత్రికి రాలేదని సోమవారం నాడు బోర్వెల్ ఆన్ చేయడం కోసం వెళ్లి మోటర్ ఆన్ చేయగా మోటర్ నుండి నీరు రాకపోవడంతో గమనించిన సిబ్బంది మోటార్ పైపు తో సహా దొంగలు దొంగిలించడంతో అవ్వక్కు అయ్యారు సిబ్బంది. ఈ విషయం తెలుసుకున్న ఇన్చార్జి డాక్టర్ వెంటనే హత్నూర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అక్కడున్న పోలీస్ సిబ్బంది ఫిర్యాదును తీసుకొని ఎంక్వయిరీ చేస్తామని చెప్పారన్నారు. ఈ విషయమై ఆసుపత్రి ఫార్మసిస్ట్ జగదీష్ స్వామి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో జరిగిన దొంగతనం విషయం వివరించారు. ఆసుపత్రికి అవుట్ పేషెంట్స్ ఇన్ పేషన్స్ వస్తూ ఉంటారని, వారిలో మహిళలు కూడా ఉంటారని, అలాగే ఆసుపత్రిలో మహిళా సిబ్బంది కూడా ఎక్కువగానే ఉన్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులు వాష్ రూమ్ కు వెళ్లాలన్న డాక్టర్ రోగులకు వైద్యం చేసి చేతులు కడుక్కోవాలన్న నీళ్లు అవసరం కనుక అనేక అవస్థలు ఎదురుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే బోర్ వెల్ మోటర్ ను బిగించి వచ్చిపోయే రోగులకు, అలాగే ఆసుపత్రి సిబ్బందికి నీటి వసతి కల్పించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ దౌల్తాబాద్ ఆసుపత్రి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభించి సంవత్సరం కూడ గడవక ముందే మోటర్ దొంగతనం జరిగింది. దీనికి కారణం ప్రభుత్వ ఆసుపత్రికి సెక్యూరిటీ లేకపోవడం, సీసీ కెమెరాలు బిగించక పోవడమే ప్రధాన కారణమని కూడా అంటున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా, సెక్యురిటీ సిబ్బంది ఉన్నా ఈ రోజు మోటర్ గొంగల పాలు అయ్యేది కాదని వాపోతున్నారు. ఈ ఆసుపత్రిలో మొత్తం 24 మంది సిబ్బంది ఉన్నారు. అందులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఈ నీటి ఎద్దడి వల్ల మహిళా ఉద్యోగులు అయితే నరకయాతన కు గురవుతున్నారు. మధ్యాహ్నం భోజనము చేసిన తర్వాత చేతులు కడుకోవాలన్నా ఈ నీటి ఎద్దడితో అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో మోటర్ దొంగతనం జరిగిన విషయాన్ని విలేకరులు గ్రామ కార్యదర్శి వద్ద ప్రస్తావించగా ఆయన అక్కడ కొత్త మోటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే డి ఎమ్ హెచ్ ఓ ని వివరణ కొరకు ఫోను ద్వార ప్రయత్నం చేయగా ఆమె ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు కాని ఆసుపత్రిలో నీటి కటకటకు ఎవరు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

# 16 పాకిస్థాన్ యూట్యూబ్ చానళ్లను నిషేధించిన భారత్

**భారత్‌పై విషం కక్కుతున్న పాక్ యూట్యూబ్ చానళ్లు**

**మహా:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై తీవ్ర చర్యలు తీసుకుంటున్న భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హోంమంత్రిత్వశాఖ సిఫార్సులతో పాకిస్థాన్‌కు చెందిన 16 యూట్యూబ్ చానళ్లను నిషేధించింది. వీటిలో డాన్, సామా టీవీ, ఏఆర్‌వై న్యూస్, జియో న్యూస్, రాజీ నామా, జీఎన్ఎన్, ఇర్షాద్ భట్టి, ఆస్మా షిరాజీ, ఉమర్ చీమా, మునీబ్ ఫరూఖ్, బోల్ న్యూస్, రాఫ్తార్, సునో న్యూస్, పాకిస్థాన్ రిఫరెన్స్, సామా స్పోర్ట్స్, ఉజైర్ క్రికెట్ వంటి చానళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి మొత్తం 6.3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. పహల్గాం దాడి తర్వాత ఈ చానళ్లు భారత్‌పై విషం కక్కుతున్నాయని, రెచ్చగొట్టేలా తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నాయన్న కారణంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పహల్గాంలో 25 మంది పర్యాటకులు, ఒక కశ్మీరీని ఉగ్రవాదులు కాల్చి చంపిన తర్వాత.. భారతదేశం, దాని సైన్యం, భద్రతా సంస్థలను రెచ్చగొట్టేలా ఇవి వార్తలు ప్రసారం చేస్తున్నాయి. అలాగే, సున్నితమైన కంటెంట్‌పై తప్పుదారి పట్టించే కథనాలు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వాటిని నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది.

# రేవంత్‌రెడ్డి వెన్నంటి ఉన్న కేసీఆర్

**ప్రభుత్వానికి కేసీఆర్ సపోర్ట్ చేస్తున్నారు**

**బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి**



**మహా :** సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పై బీజేఎల్ పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఉరితీసిన తప్పులేదని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడినా, రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి కేసీఆర్ వెన్నంటి ఉన్నారని స్పష్టం అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సపోర్ట్ చేస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 5 సంవత్సరాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగాలని కేసీఆర్ అంటున్నారంటూ ఆ రెండు పార్టీలు ఒకటేనని స్పష్టం అవుతుందన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత స్పందిస్తూ కేసీఆర్ సభ కొండంత రాగం తీసి దిక్కుమాలిన పాట పాడినట్టుగా ఉందని విమర్శించారు. తెలంగాణ విధ్వంసానికి కారణం కేసీఆర్ అన్నారు. సభ కోసం రూ.150 కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష మందిని కూడా జమ చేయలేక పోయారని ఆరోపించారు. "సభ అట్టర్ ఫ్లాప్ అయింది. తెలంగాణకు కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చింది కేసీఆర్ నీకు తెలియదా? అన్ని తెలిసి 11 రూపాయలు కూడా ఇవ్వలేదని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. మీరు పాలివ్వలేదని తెలిసే మిమ్మల్ని ప్రజలు ఓడించారు. మావోయిస్టులను చర్చలకు పిలువలేదు కేసీఆర్, మీ ప్రభుత్వంలో ఎన్ కౌంటర్ లు చేయలేదా? హింసను వీడి జన జీవనంలోకి రావాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చెయ్యి.. అధికారం కోల్పోయి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారు... గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపి ఆ తరవాత వాళ్ళను చంపింది నిజం కాదా... ఆ ప్రభుత్వంలో మీరు కూడా భాగస్వాములే కదా? తెలంగాణలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది అని పగటి కలలు కంటున్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు అసహ్యించుకుంటారు తప్ప మిమ్మల్ని అక్కున చేర్చుకోరు. బీఆర్ఎస్ మోడల్ అంటే దుర్మార్గం, కుటుంబ పాలన, విధ్వంసం, అరాచకం. కాళేశ్వరం గురించి కెసిఆర్ ఎందుకు మాట్లాడరు. అది ఎత్తిపోతల పథకం కాదు, తిప్పి పోతల పథకం." అని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# లండన్ వీధుల్లో ఇండియా జిందాబాద్

**పాకిస్థాన్ పౌరుల నిరసనను ఖంగుతినిపించిన భారతీయులు**

భారత హైకమిషన్ ముందు .. పాక్ పౌరుల నిరసన ప్రదర్శన

విషయం తెలుసుకుని వేలాదిగా వచ్చిన భారతీయులు

ఇరువర్గాల మధ్య ఘర్షణ నివారణకు పోలీసుల భారీకేడ్లు



**మహా:** లండన్ వీధుల్లో భారత్ మాతా కీ జై, ఇండియా జిందాబాద్ నినాదలతో హోరెత్తాయి. మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. భారత హైకమిషన్ ముందు చేపట్టిన పాక్ పౌరుల నిరసన ప్రదర్శనను డామినేట్ చేశాయి. పాక్, భారత మద్దతుదారుల పోటాపోటీ నిరసనలతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. భారత మద్దతుదారుల సంఖ్య క్షణక్షణానికి పెరిగిపోతుండడంతో పాక్ నిరసనకారులు అక్కడి నుంచి నిష్క్రమించారు. పహల్గామ్ ఉగ్రదాడిని తమ దేశానికి ముడిపెడుతూ భారత్ చేస్తున్న ఆరోపణలను లండన్‌లోని పాక్ సంతతి పౌరులు ఖండించారు. భారత హైకమిషన్ ముందు ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. సుమారు యాభై, అరవై మంది పాక్ జెండాలు చేతబట్టి భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రవాస భారతీయులు వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ, లౌడ్ స్పీకర్ల ద్వారా పాకిస్థానీ నిరసనకారుల గొంతును అణచివేస్తూ భారతీయ మద్దతుదారులు దేశభక్తి గీతాలు ఆలపించారు. "జై శ్రీరామ్", "వందేమాతరం", "భారత్ మాతా కీ జై" వంటి నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణను నివారించేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరోవైపు, పాకిస్థానీ నిరసనకారులు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా, పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసినప్పటికీ వారి సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు, వారిలో ఉత్సాహం కొరవడింది. పహల్గామ్ దాడి వెనుక పాక్ హస్తం ఉందనడానికి ఆధారాలు లేవని, ఎన్నికల నేపథ్యంలోనే భారత్ ఆరోపణలు చేస్తోందని కొందరు పాక్ నిరసనకారులు వ్యాఖ్యానించారు. ఈ ఘటన బ్రిటన్‌లో రాజకీయ చర్చకు దారితీసింది. లండన్ వీధుల్లో విదేశీ వివాదాలు చోటుచేసుకోవడంపై కొందరు స్థానిక రాజకీయ నేతలు, వ్యాఖ్యాతలు ఆందోళన వ్యక్తం చేశారు. బహుళ సాంస్కృతిక విధానం విజయవంతమైందా అనే దానిపై చర్చ మొదలైంది. మెట్రోపాలిటన్ పోలీసులు ఇరువర్గాలను అదుపు చేయడానికి ప్రయత్నించారు.

# పాతబస్తీలో ఈడీ సోదాల కలకలం

**యాకుత్‌పురా, సంతోష్‌నగర్‌లో సోదాలు**

భూదాన్ భూముల కేసు దర్యాప్తులో భాగంగా తనిఖీలు

సుకూర్, షర్ఫన్ సహా నలుగురి నివాసాలపై దాడులు

ఈఐపీఎల్ సంస్థకు సుకూర్ బినామీ అని ఈడీ ఆరోపణ

గతంలో ఈ కేసులో కలెక్టర్, తహసీల్దార్‌ను విచారించిన ఈడీ

**మహా :** భూదాన్ భూముల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యాకుత్‌పురా, సంతోష్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని కొన్ని నివాసాల్లో అధికారులు సోదాలు జరిపారు. భూదాన్ భూముల వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఈఐపీఎల్ సంస్థ లావాదేవీలపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ సంస్థ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా భూములు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈఐపీఎల్ సంస్థకు సుకూర్ అనే వ్యక్తి బినామీగా వ్యవహరించాడనే అనుమానంతో ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుకూర్‌తో పాటు అతని బంధువు షర్ఫన్, మరో ఇద్దరు వ్యక్తుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భాగంగా ముఖ్యమైన పత్రాలు, లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇదే కేసులో గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్ కుమార్‌ను, మహేశ్వరం తహసీల్దార్‌ను కూడా ఈడీ అధికారులు విచారించారు.

# ఎంసీఆర్ హెచ్ఆర్ డీ వైస్ ఛైర్మన్‌గా శాంతకుమారి

**సీఎం రేవంత్ కీలక నిర్ణయం.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



**మహా :** పాలనా పరంగా ప్రక్షాళన చేస్తున్న సీఎం రేవంత్ తాజాగా పలువురు సీనియర్ ఐఏఎస్ ల బాధ్యతల్లో మార్పులు చేసారు. నూతన సీఎస్ గా రామకృష్ణారావును నియమించారు. దీంతో, ప్రస్తుత సీఎస్ గా ఉన్న శాంతకుమారికి రేవంత్ ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారనే చర్చ సాగింది. ఈ నెల 30న సీఎస్ గా పదవీ విరమణ చేసిన తరువాత శాంత కుమరికి కీలక పదవి ఇస్తారనే అంచనాలూ ఉన్నాయి. ఇప్పుడు సీఎం రేవంత్ ప్రస్తుత సీఎస్ శాంత కుమారికి కీలక పదవి ఖరారు చేసారు. శాంత కుమారిని ఎంసీహెచ్ఆర్డీ వైస్ ఛైర్మన్ గా నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 30న పదవీ విరమణ తరువాత శాంత కుమారి ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. తొలుత శాంత కుమారికి సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్ గా బాధ్యతలు ఇస్తారని భావించారు. అయితే, ప్రస్తుతం సీఎంఓలో ఉన్న ఒక అధికారికి ఈ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో, శాంత కుమారికి ఈ పదవి ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 1989 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శాంతి కుమారి 2023 జనవరి 11వ తేదీ నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలను అందిస్తున్నారు.

# పహల్గాం ఉగ్రదాడి వెనుక చైనా

**ఆధారాలను సేకరించిన భారత సైన్యం.. వెలుగులోకి సంచలన నిజాలు**



పహల్గాం ఉగ్రదాడి వెనుక చైనా హస్తం ఉందని భారత్ నిర్ధారణకు వచ్చింది. ఉగ్రదాడి జరిగిన ప్రాంతంలో సైనిక బలగాలు జరిపిన సోదాల్లో లభించిన ఆధారాలతో ఈ నిర్ధారణకు బారత దేశం వచ్చింది. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఐదుగురు టెర్రరిస్టులు చైనాకు చెందిన ఫోన్లు, ఇతర సామాగ్రిని వాడినట్లు నిఘా వర్గాలు తేల్చేశాయి. ఉగ్రవాదులు చైనీస్ యాప్స్ ద్వారానే కమ్యూనికేషన్ జరిపినట్లు సమాచారం. ఈ మేరకు పహల్గాంలో ముష్కరులు కాల్పులు జరిపిన చోట చైనీస్ శాటిలైట్ ఫోన్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో చైనా సాయంతోనే పాకిస్థాన్ ఉగ్రదాడి జరిపినట్లు అధఇకారులు అంచనాకు వచ్చారు. మరోవైపు భారత్ పాకిస్థాన్ వివాదం నేపథ్యంలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి మహ్మద్ ఇషాక్ దర్ చైనాకు చెందిన తన కౌంటర్‌పార్ట్ వాంగ్ యీతో ఫోన్‌లో మాట్లాడారు. వీరిద్దరి మధ్య టెలిఫోన్ కన్వర్జేషన్ సుదీర్ఘంగా సాగినట్లు తెలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలు, పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయాలను వాంగ్ యీతో చెప్పినట్లు తెలుస్తోంది.

Z కేటగిరి

EDITORIAL సంపాదకీయం

# రజతోత్సవం పేలని బాంబు !



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**మీరు సూర్యునిలా ప్రకాశించాలంటే మీరు ముందుగా మండాలి**
**అని హిట్లర్ అన్నాడు**

కేసీఆర్ మండలేదు.సూర్యునిలా ప్రకాశించనూ లేదు. బాడీ లాంగ్వేజ్ ను బట్టి ఆయన తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్టు కనిపించారు.అధికారం లేని వ్యథ ఆయనను నిలువునా దహించి వేస్తున్నది.మరోవైపు కుటుంబంలో జరుగుతున్న 'ఆధిపత్య పోరాటాల'తో సతమతమవుతున్నారు.కేసీఆర్ లో మునుపటి వాక్పటిమ లేదు. గాంభీర్యం లేదు.రణ నినాదాలు లేవు.ఆయన కంఠస్వరానికి 'భాస్వరం'గా మండే స్వభావం ఉండేది.ఒకప్పుడు 'తెలంగాణ ముఖం' గా చెప్పుకునే కేసీఆర్ ఏ కారణంగానో 'బేల' గా కనిపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పలు సందర్భాల్లో చెప్పినట్టుగా 'కేసీఆర్ చరిత్ర ఇక గతం' అన్నట్టుగానే నిస్సారమైన ఆయన ప్రసంగాన్ని బట్టి అర్థమవుతున్నది.తెలంగాణ ఉద్యమం కేసీఆర్ ను నాయకునిగా తయారు చేసుకున్నది,కానీ కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తయారుచేసుకోలేదన్న స్పృహలో ఆయన లేరు.ఇందుకు ప్రధానకారణం ,ఆయన వంది మాగధులు,భజన బృందాలు.వాండ్ల మాయ నుంచి ఆయన వెలుపలికి రాలేకపోతున్నారు. నిరంతరం ప్రజల్లో ఉండవలసిన ప్రజానాయకుడు,ప్రజలలోకి రావడమే ఘనకార్యమేమిటో మనకు అర్థం కాదు.ఫార్మ్ హౌజ్ కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు నడపడమే భారీ తప్పిదం.ప్రజల నుంచి ఎందుకు దూరమయ్యామో ఆత్మవిమర్శ చేసుకోకపోవడం,దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం వల్ల .... ఆ పార్టీకి ఇక భవిష్యత్తు లేదని విశ్లేషకులంటున్నారు.

రజతోత్సవ సభలో ముఖ్యాంశాలు :1. తన వారసుడు కేటీఆర్ అని ప్రకటించడం.2.అసెంబ్లీకి హాజరు కాబోనని స్పష్టం చేయడం.3.రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా చెప్పడం.4.కరెంటు, తాగు,సాగునీరు,రైతుబంధు గురించి పాడిన పాటే పాడడం.5.మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్రప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంచనా వేసినట్లుగానే ఎల్కతుర్తి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది.అదిగో పులి,ఇదిగో కేసీఆర్ అంటూ గడచిన నెలరోజులుగా బిఆర్ఎస్ శ్రేణులు ఊదరగొట్టాయి.ఆ ప్రచారం ఎక్కడిదాకా తీసుకువెళ్లారంటే,రజతోత్సవ సభతో రేవంత్ ప్రభుత్వం గజ గజ వణికిపోతుందని,కేసీఆర్ కు అధికారం ఇచ్చేసి,రేవంత్ ఇంటికి వెళ్ళిపోతారనే వరకు సాగింది.రేవంత్ పై 'యుద్ధం' ప్రకటిస్తారని ,ఒక కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలకు ఇస్తారని ఊహాగానాలు జరిగాయి.''నేను కొడితే గట్టిగా కొడతా'' అని గతంలో కేసీఆర్ అన్నారు.రజతోత్సవసభ సందర్భాన్ని అందుకు ఉపయోగించుకుంటారని కొందరు అనుకున్నారు.

నీ పాత ముచ్చట్లు,పురాణాలు చెప్పడానికి పార్టీ అధినేత పరిమితమయ్యారు.కేసీఆర్ ప్రసంగం యావత్తూ మళ్ళీ గతంలో తెలంగాణ ఉద్యమం,తన పరిపాలన,రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై దూషణల చుట్టే తిరిగింది.పార్టీ శ్రేణుల్లో కేసీఆర్ ఎటువంటి ఉత్తేజం నింపలేకపోయారు.''చంద్రబాబు నాయుడు తెలంగాణ పదాన్ని అసెంబ్లీలో ప్రస్తావించకుండా నిషేధించారు'' అనే మాట అసందర్భమైనది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ప్రస్తావించలేదు.కాళేశ్వరం ప్రాజెక్టు ఊసెత్తలేదు.ఫోన్ ట్యాపింగ్ నేరం గురించి మాట్లాడలేదు.''నోరు కట్టుకొని,కడుపు కట్టుకొని పరిపాలించాం''అని కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు జనం నమ్మరు. పదేండ్ల హయాంలో 'రైతుబంధు' వంటి పథకం ద్వారా 27 వేల కోట్ల ప్రజాధనం ఎలా దుర్వినియోగం జరిగిందో ప్రజలకు తెలుసు.కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణాలన్నీ వెలుగులోకి వస్తున్నవి.మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం,కేసీఆర్ ప్రభుత్వం కూలిపోవడం

కాకతాళీయమేమీ కాదు.రెండింటి మధ్య పోలికలున్నవి.బిఆర్ఎస్ పార్టీ ఎందుకు పెట్టవలసి వచ్చిందో, జాతీయ రాజకీయాల్లోకి ఎందుకు వెళ్లాలనుకున్నారో కేసీఆర్ ఎల్కతుర్తిలో హాజరైన లక్షలాది మంది తెలుసుకోవాలనుకున్నారు.కానీ కేసీఆర్ నుంచి జవాబు లేదు. వివరణ లేదు.''కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలకు మోసపోయారు'' అని ప్రజల్ని మరోసారి నిందించారు ,తప్ప తమ వ్యవహార శైలి,ప్రగతిభవన్ పాలన,ఫార్మ్ హౌజ్ లో విశ్రాంతి,ప్రజలతో డిస్కనెక్టు వంటి పెక్కు అంశాలను కేసీఆర్ ఉద్దేశపూర్వకంగానే గాలికొదిలేశారు.ముఖ్యంగా తమ పార్టీ జాతీయపార్టీయా?ప్రాంతీయ పార్టీయా? అన్న విషయంలో ఆయన స్పష్టత ఇవ్వలేదు.అదొక సస్పెన్స్ వ్యవహారంగానే మిగిలింది. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని,కాలం కలిసొస్తే ప్రధాని కావాలన్న తన ఆశలు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓటమితో పూర్తిగా అడుగంటాయి.'తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ' ప్రస్తావన తీసుకురాలేదు.

మరీ ముఖ్యంగా 'ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో' సమాధానం చెప్పవలసిన బాధ్యత నుంచి కేసీఆర్ తప్పించుకుంటున్నారు.ప్రజలకు దూరమైనందుకు,గడీ పాలన సాగించినందుకు,తన కుటుంబమే తెలంగాణకు దిక్కు అనే సందేశాన్ని ప్రజలకిచ్చినందుకు ప్రజలు 'గుణపాఠం' చెప్పారని కేసీఆర్ ఎలా మాట్లాడగలరు?అది ఆయన నైజానికి విరుద్ధం.'కేసీఆర్ చెబుతారు,మిగతా వాళ్లంతా వినాలి.అవసరమైతే నోట్స్ రాసుకోవాలి.అంతే.' 2001 నుంచి 2025 వరకు జరుగుతున్నదంతా ఇదే.ఇంతకన్నా భిన్నంగా కేసీఆర్ నుంచి ఆశించడం అమాయకత్వమే కాగలదు.తాను 'సర్వజ్ఞాని' కనుక,తాను ఏమి చెప్పినా ప్రపంచమంతా వింటుందని,అనుసరిస్తుందని అనుకుంటారు.గట్టిగా నమ్ముతారు.ఏప్రిల్ 27 న ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మినహా మరెవరూ ప్రసంగించలేదు.ఒకే ఒక్కడు కేసీఆర్ మాత్రమే ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు.ఒక సందర్భంలో తన కుమారుడు కేటీఆర్ పేరు ప్రస్తావించారు.అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ పాత్రను కేసీఆర్ ప్రశంసించడం,హరీష్ రావు వంటి నాయకులను వెనుక బెంచీల్లోకి నెట్టివేయడమే.

ఉత్తర తెలంగాణ ఇదివరకు టిఆర్ఎస్ కంచుకోట.ఆ కోటను 2023 లో కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా పడగొట్టింది.ఇటీవల బీజేపీ పుంజుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించింది.అయితే ఆ ప్రాంతంలో ఒకప్పుడు నెత్తుటేరులు పారాయి.భూస్వాములకు వ్యతిరేకంగా మావోయిస్టుల నాయకత్వంలో రైతాంగపోరాటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి.'నిప్పురవ్వ' దావానలమైనట్టుగా తెలంగాణ అంతటా మావోయిస్టుల ఉద్యమం సాగింది.2001 కల్లా ఆ ఉద్యమాల 'వేడి'ని కేసీఆర్ అందిపుచ్చుకున్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ 1996 ప్రాంతాల్లోనే తీర్మానించింది.కనుక ఉత్తర తెలంగాణలో రాడికల్స్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో జనం తెలంగాణ ఉద్యమం వైపునకు మొగ్గు జూపారు.అంతిమంగా కేసీఆర్ కు అది ప్రయోజనం చేకూర్చి పెట్టింది.కేంద్రప్రభుత్వ అణచివేత చర్యలతో కాల క్రమంలో మావోయిస్టులు బలహీనపడ్డారు.కానీ వాళ్ళ సానుభూతిపరులు,ఆ ఉద్యమం కారణంగా లాకప్పులలో హింసకు గురైన వారూ,జైళ్లలో ఉంది వచ్చినవారూ వేలాదిమంది ఉన్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని,రేవంత్ రెడ్డిని దెబ్బకొట్టాలంటే ఏదో రూపంలో మావోయిస్టుల సానుభూతిని దక్కించుకోవడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. అందుకే మావోయిస్టులతో చర్చలు జరపాలంటూ కేంద్రప్రభుత్వానికి ఎల్కతుర్తి సభావేదిక మీదుగా ఆయన డిమాండ్ చేశారు.కేసీఆర్ రాజకీయప్రయోజనాల గురించి మావోయిస్టులకు బాగా తెలుసు. ఆయన హయాంలో జరిగిన అణచివేత,నిర్బంధం, భావ ప్రకటన స్వేచ్ఛపై మోపిన ఉక్కుపాదం అందరికీ తెలుసు.కొన్ని బూటకపు ఎన్ కౌంటర్లు కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగానే జరిగాయి. ఇప్పుడాయన ప్రాజాస్వామిక వాదిగా నటిస్తే నమ్మే పరిస్థితిలో జనం లేరు.కేసీఆర్ కు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే 'ఉపా' చట్టం కింద ముంబై జైళ్లలో ఏండ్ల తరబడి మగ్గిపోతున్న సుప్రసిద్ధ విప్లవకవి వరవరరావు,రాజ్యాంగ నిర్మాత అంబెడ్కర్ మనవడు ప్రొఫెసర్ ఆనంద్ తెల్ తుంబ్డే వంటి వారి విడుదల గురించి ఏనాడైనా మాట్లాడారా? సీఎంగా ఉన్న వేళ ఆయన ఆ హోదాలో తెలంగాణ కవి అరెస్టును ఎందుకు ఖండించలేదు.80 ఏండ్లు పైబడిన వరవరరావు విడుదల కోసం కేంద్రప్రభుత్వానికి ఎందుకు డిమాండ్ చేయలేదు.కేంద్రప్రభుత్వానికి,సుప్రీంకోర్టుకు ఎందుకు లేఖలు రాయలేదు?

'తెలంగాణకు విలన్ నెంబర్ 1 కాంగ్రెస్' అని సూత్రీకరించడం చరిత్రకు వక్రభాష్యం చెప్పే ప్రయత్నమే. కేసీఆర్ 'విలన్' లను ఎప్పటికప్పుడు,తన అవసరార్థం మార్చుకుంటూ ఉంటారు.2004 లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేసినప్పుడు చంద్రబాబు విలన్.2009 లో చంద్రబాబుతో పొత్తుపెట్టుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ విలన్.తెలంగాణ రాష్ట్రమిస్తే టిఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తామని,సోనియాగాంధీకి హామీ ఇచ్చి,తెలంగాణ ఏర్పాటు అనంతరం ఆ హామీని తుంగలో తొక్కిన వ్యక్తి కేసీఆర్.2014 ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో కాంగ్రెస్,బీజేపీ,టీడీపీలను తుడిచిపెట్టడానికి కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు.పన్నని పన్నాగాలు లేవు.'ఫక్తు రాజకీయపార్టీ'గా ఉద్యమ పార్టీ అవతరించించడంతోనే ఇక రాష్ట్రంలో 'ఇంటి పార్టీ' టిఆర్ఎస్ మినహా మరొక పార్టీ ఉండరాదని ఆయన అనుకోవడం ఒక వింత.2018 ఎన్నికల్లో మళ్ళీ చంద్రబాబును విలన్ గా జనం ముందు నిలబెట్టారు.

టీడీపీ,కాంగ్రెస్,లెఫ్ట్ పార్టీలన్నీ 'కూటమి'గా ఏర్పడడం వెనుక కూడా కేసీఆర్ హస్తమున్నట్టు అప్పట్లో ఢిల్లీ మీడియా వర్గాల్లో ఒక ప్రచారం సాగింది.చంద్రబాబును కలుపుకుంటే తప్ప తన గెలుపు సునాయాసం కాదని కేసీఆర్ భావించి,అందుకు తగినట్లుగా ప్రణాళికను రచించి,కాంగ్రెస్ పార్టీ 'తెలంగాణ ప్రముఖుడొకరి'తో ఢిల్లీలోనే మంతనాలు జరిపించి 'పొత్తు' కుదిరేందుకు మార్గం సుగమం చేశారని కేసీఆర్ పై అపవాదు ఉన్నది.2023 లో ఓటమి తర్వాత కాంగ్రెస్ పార్టీని విలన్ నెంబర్ 1 గా నిర్ధారిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకన్నా రెండాకులు ఎక్కువే చదివినట్టు అసెంబ్లీ ఫలితాల తర్వాత కేసీఆర్ కు అర్థమైంది. అందువల్ల వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీతోనే తన యుద్ధంగా ఆయన అభివర్ణిస్తున్నారు.ఇలాంటి వ్యాఖ్యలు కేసీఆర్ నోటి నుంచి రావొచ్చని ముందుగానే భావించిన రేవంత్ రెడ్డి,తమకు బిఆర్ఎస్ తో పోటీయే లేదని,బిజెపితోనే తమ సమరమని కొన్ని నెలల కిందటే చెప్పారు.

వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ పరిణామాలు,పొత్తులు,ఎత్తులు,భావోద్వేగాలు ఎలా ఉంటాయో ఇప్పుడే ఇదమిద్ధంగా నిర్ధారణకు రాలేం.అయితే బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పక్కా వ్యూహంతోనే 'బాహుబలి' సభ జరిపారు.అటు కాంగ్రెస్ లేదా బిజెపిలోకో తమ పార్టీ క్యాడర్ వెళ్ళే సూచనలు ఉండడం వల్లనే,ఆ క్యాడర్ జారిపోకుండా 'బలప్రదర్శన' చేశారు.వందలాది కోట్లు ఖర్చు చేసి,జనాన్ని రప్పించి తీరా సభను తుస్సుమనిపించారు.ఎల్కతుర్తి సభానంతరం చాలా మందితో నేను మాట్లాడాను.సభపైనా,కేసీఆర్ ప్రసంగం పైనా అభిప్రాయం అడిగాను.''కిక్కు లేదు సార్.కేసీఆర్ ఇంతకుముందు అగ్గిబరాటా లాగ ఉండే.ఇప్పుడు ఆయన మాటల్లో పస లేదు.సభకు వచ్చిన వాళ్లందరికీ గిట్టుబాటు అయ్యింది.రవాణా సౌకర్యం కల్పించారు. కొన్ని చోట్ల వెయ్యి,మరికొన్ని చోట్ల రెండు వేల రూపాయలు,భోజనం,మందు అన్నీ చూసుకున్నారు.ఏమైనా మా పార్టీ సౌండ్ పార్టీ సార్!'' అని బిఆర్ఎస్ కార్యకర్తలు చెప్పారు.కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోనని పరోక్షంగా ప్రకటించడం పట్ల క్యాడర్ నిరాశ చెందుతున్నారు.

''సారు అసెంబ్లీకి పోవాలె.పోకపోతె ఎట్ల.అప్పుడే మజా.ఆయన ఫార్మ్ హౌజ్ లోనే రెస్టు తీసుకుంట అంటే ఎట్ల?పంటనంటే ఎట్ల? ఆయన కొడుకు కేటీఆర్ తో అయ్యేదేం లేదు.తండ్రికన్నా కొడుక్కి పొగరెక్కువ. కేటీఆర్ ఏమిట్కి ఏమైందు?గింత మదమేంది సార్ ! అధికారంలో ఉన్నప్పుడు ఎవలనన్న కలిసిండా?ఆయన పీఏలు కూడ వందల కోట్లు కూడబెట్టుకున్నరట. ఊర్లల్ల అనుకుంటున్నరు.నిజమో కాదో తెల్వది.మల్ల అధికారం ఇస్తె మార్పుంటదా? వీల్లు మారతర ? కార్యకర్తలను పురుగుల్లెక్క జూసిండ్రు,అధికారం ఉన్నప్పుడు.ఇప్పుడన్ని సుద్దపూస మాటలు మాట్లాడుతున్నరు. అసలు మాకేం ఒరిగింది సార్.ఆ పథకం,ఈ పథకం అని పైసలైతే వచ్చేటివి.గా పైసలతో మేము డైరెక్టుగ బ్రాండి షాపుకే పోతుంటిమి.ఆ పైసల కోసమే మావాళ్లంతా సారు దిక్కు మొగ్గు జూపుతాండ్రు.గంతే.రేవంత్ మీద మాకేం కోపముంటది సార్!''అని కొందరు కార్యకర్తలంటున్నారు.

ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రం సాకారమై 12 ఏండ్లు గడుస్తున్నవి.ఇంకా తెలంగాణ గురించి,ఆ ఉద్యమం గురించి,చంద్రబాబు గురించి,చావు నోట్లోకి పోయి వచ్చిన వైనం గురించి,నాడు పడ్డ కష్టాల గురించి,టిఆర్ఎస్ ఆవిర్భవించినపుడు వెటకారం చేసిన సందర్భాల గురించి కేసీఆర్ మాట్లాడడం ముమ్మాటికీ అసందర్భమే.ఆయనకు ఇంకా ఆ 'సెంటిమెంటు' వర్కవుట్ అవుతుందని ఆశలున్నట్లున్నది.తెలంగాణ,తెలంగాణ వాదం గురించి 2025 లో ఎవరూ మాట్లాడే పరిస్థితి లేదు. కేసీఆర్ పాలనతో పోల్చుకుంటే రేవంత్ ప్రభుత్వం చాలా బెటర్ అనే మాట వినిపిస్తోంది.'మంచం ఎంత పొడవుంటే కాళ్ళు అంతే చాపాలి' అని సీఎం రేవంత్ ఒక సమావేశంలో అన్నారు.బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసిన కేసీఆర్,ఆ విషయాన్ని బహిరంగంగా చెప్పలేకపోతున్నారు.తమ దగ్గర ఉన్న ఆర్థికవనరుల పరిమితి మేరకే కార్యక్రమాలు చేపడుతున్నట్టు సీఎం రేవంత్ ధైర్యంగా ప్రజలకు వివరిస్తున్నారు.

ఇక బీజేపీని పెద్దగా విమర్శించకపోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయని,కేసీఆర్,మోడీ మధ్య 'సానుకూలత' నెలకొనే సంకేతాలున్నట్టు ఢిల్లీలోని బీజేపీ వర్గాలే అనుమానిస్తున్నాయి.ఈ కారణంగానే కాంగ్రెస్ ను నెంబర్ 1 విలన్ గా ఆయన ప్రకటించారని ఆ వర్గాలంటున్నవి.వచ్చే ఎన్నికల నాటికి బిజెపి ,బిఆర్ఎస్ మధ్య అవగాహన ఉండే అవకాశాలున్నట్టుగా జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారవేయలేమని బీజేపీ వర్గాలంటున్నాయి.ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికలనే ఉదాహరణగా వారంటున్నారు.గ్రాడ్యుయేట్,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీ చేయకుండా,తమ గెలుపునకు పరోక్షంగా సహకరించారని బీజేపీ నాయకులంటున్నారు.ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ సంప్రదాయ ఓటర్లు ఎవరికీ వేశారని ప్రశ్నిస్తున్నారు.

''చాలా సంవత్సరాల క్రితం జీవించిన ప్రజలకు భవిష్యత్తులో జీవితం ఎలా ఉంటుందో తెలియదు. వారు వారి విలువలను వారి సమయానికి అనుగుణంగా మాత్రమే నిర్ణయించుకున్నారు.గత విలువల ప్రకారం భవిష్యత్తు మానవుడు ఏ మాత్రం మనుగడ సాగించలేడు.భవిష్యత్తు మనుగడ సాగించాలంటే గతం మరణించాలి'' అని తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే అన్నాడు.బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా 'గతంలో' జీవిస్తున్నట్టు కనబడుతున్నది.అందుకే పదే,పదే 'తెలంగాణ' అని కలవరిస్తున్నారు.పలవరిస్తున్నారు. తెలంగాణ ఇక గతం.రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలలో ప్రభుత్వాన్ని నడిపే రాజకీయ నాయకత్వంపై విమర్శలు చేయవచ్చు.తాము ఎలా అభివృద్ధి చేయగలమో చెప్పగలగాలి.తమకు అధికారపక్షం పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించవచ్చు.ప్రతిసారీ తెలంగాణ ఉద్యమం గురించి ప్రస్తావించడమంటే తాము మాత్రమే అధికారంలో శాశ్వతంగా ఉండాలన్న ఆకాంక్ష బట్టబయలవుతోంది.

రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటమే లేదు.మాజీ మంత్రి హరీశ్ రావును ఈ సభ ఏర్పాట్లలో లేకుండా చేయడం రాజకీయకోణం.తన కుమారుడు కేటీఆర్ మినహా మరొకరు వారసుడు కాదన్నది కేసీఆర్ మనసులో మాట.కానీ జయశంకర్ సార్ ను విస్మరించడమంటే తెలంగాణ ఉద్యమం గురించి కేసీఆర్ చేసే వ్యాఖ్యలన్నీ 'అవకాశవాద' మాటలుగా అనుమానించవలసి ఉన్నది.కేసీఆర్ ప్రత్యేక తెలంగాణకు తానే సిద్ధాంతకర్త అని అనుకుంటారు.



> నిరంతరం ప్రజల్లో ఉండవలసిన ప్రజానాయకుడు, ప్రజలలోకి రావడమే ఘనకార్యమేమిటో మనకు అర్థం కాదు. ఫార్మ్ హౌజ్ కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు నడపడమే భారీ తప్పిదం. ప్రజల నుంచి ఎందుకు దూరమయ్యామో ఆత్మవిమర్శ చేసుకోకపోవడం, దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం వల్ల .... ఆ పార్టీకి ఇక భవిష్యత్తు లేదని విశ్లేషకులంటున్నారు.

> రజతోత్సవ సభలో ముఖ్యాంశాలు :1. తన వారసుడు కేటీఆర్ అని ప్రకటించడం.2.అసెంబ్లీకి హాజరు కాబోనని స్పష్టం చేయడం.3.రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా చెప్పడం. 4.కరెంటు, తాగు, సాగునీరు, రైతుబంధు గురించి పాడిన పాటే పాడడం.5.మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్రప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయడం.

> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంచనా వేసినట్లుగానే ఎల్కతుర్తి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది.అదిగో పులి,ఇదిగో కేసీఆర్ అంటూ గడచిన నెలరోజులుగా బిఆర్ఎస్ శ్రేణులు ఊదరగొట్టాయి.ఆ ప్రచారం ఎక్కడిదాకా తీసుకువెళ్లారంటే,రజతోత్సవ సభతో రేవంత్ ప్రభుత్వం గజ గజ వణికిపోతుందని,కేసీఆర్ కు అధికారం ఇచ్చేసి,రేవంత్ ఇంటికి వెళ్ళిపోతారనే వరకు సాగింది. కానీ పాత ముచ్చట్లు,పురాణాలు చెప్పడానికి పార్టీ అధినేత పరిమితమయ్యారు.

> ఎల్కతుర్తి సభలో ఒకే ఒక్కడు కేసీఆర్ మాత్రమే ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు. ఒక సందర్భంలో తన కుమారుడు కేటీఆర్ పేరు ప్రస్తావించారు.అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ పాత్రను కేసీఆర్ ప్రశంసించడం,హరీష్ రావు వంటి నాయకులను వెనుక బెంచీల్లోకి నెట్టివేయడమే.

> తెలంగాణకు విలన్ నెంబర్ 1 కాంగ్రెస్' అని సూత్రీకరించడం చరిత్రకు వక్రభాష్యం చెప్పే ప్రయత్నమే.కేసీఆర్ 'విలన్' లను ఎప్పటికప్పుడు,తన అవసరార్థం మార్చుకుంటూ ఉంటారు. 2004 లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేసినప్పుడు చంద్రబాబు విలన్. 2009 లో చంద్రబాబుతో పొత్తుపెట్టుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ విలన్. తెలంగాణ రాష్ట్రమిస్తే టిఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తామని,సోనియాగాంధీకి హామీ ఇచ్చి,తెలంగాణ ఏర్పాటు అనంతరం ఆ హామీని తుంగలో తొక్కిన వ్యక్తి కేసీఆర్.

> వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ పరిణామాలు,పొత్తులు,ఎత్తులు,భావోద్వేగాలు ఎలా ఉంటాయో ఇప్పుడే ఇదమిద్ధంగా నిర్ధారణకు రాలేం. అయితే బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పక్కా వ్యూహంతోనే 'బాహుబలి' సభ జరిపారు.అటు కాంగ్రెస్ లేదా బిజెపిలోకో తమ పార్టీ క్యాడర్ వెళ్ళే సూచనలు ఉండడం వల్లనే,ఆ క్యాడర్ జారిపోకుండా 'బలప్రదర్శన' చేశారు.వందలాది కోట్లు ఖర్చు చేసి,జనాన్ని రప్పించి తీరా సభను తుస్సుమనిపించారు.

> రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటమే లేదు.మాజీ మంత్రి హరీశ్ రావును ఈ సభ ఏర్పాట్లలో లేకుండా చేయడం రాజకీయకోణం.తన కుమారుడు కేటీఆర్ మినహా మరొకరు వారసుడు కాదన్నది కేసీఆర్ మనసులో మాట.కానీ జయశంకర్ సార్ ను విస్మరించడమంటే తెలంగాణ ఉద్యమం గురించి కేసీఆర్ చేసే వ్యాఖ్యలన్నీ 'అవకాశవాద' మాటలుగా అనుమానించవలసి ఉన్నది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

## సామాన్య రైతులకు అర్థమయ్యేలా

# భూ భారతి ఉంది

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి..**

ప్రజావాణిలో వందల సంఖ్యలో భూ వివాద దరఖాస్తులు

భూ భారతి అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



**అబ్దుల్లాపూర్మెట్,మహా:** సామాన్య రైతులకు అర్థమయ్యేలా భూ భారతి పోర్టల్ ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండల ప్రాంత ప్రజలకు భూ భారతిపై అవగాహన కార్యక్రమం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తారా కన్వెన్షన్ హాల్ లో సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ సామాన్య రైతులకు అర్థమయ్యేలా భూ భారతి పోర్టల్ ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి తీసుకొచ్చి భూ దందాలకు తెరలేపారని విమర్శించారు. దీంతో సమస్యలు మొదలయ్యాయన్నారు. రాష్ట్రంలో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొల్లగొట్టి.. కోట్ల రూపాయాలను దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో లాక్కున్న ప్రభుత్వ భూములను భూ భారతితో వెలికితీసి పేదలకు పంచుతామన్నారు. నిరుపేదలు 60 గజాల స్థలం ఇవ్వ లేదుకానీ... వేలాది ఎకరాలను భూ కబ్జాదారులకు కట్టబెట్టారని అన్నారు. ధరణి వచ్చిక భూ సమస్యలతో.. సంబంధిత అధికారులు చుట్టు తిరిగి.. తిరిగి... ప్రజలు అలసిపోయారని అన్నారు. ఇప్పుడు మీకు అలాంటి సమస్య ఏమీ ఉండదన్నారు.

**ప్రజావాణిలో ప్రతి వారం వందలాది దరఖాస్తులు: కలెక్టర్**

భూ భారతితో భూ సమస్యలన్నీ స్వస్తి పలికినట్లేనని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే మీ భూ సమస్యలను పరిష్కరించవొచ్చునన్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్ పనిచేశాను. రంగారెడ్డి జిల్లాలో ఉన్నన్ని భూ సమస్యలు ఏ జిల్లాలలో లేవన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రతివారం వందల సంఖ్యల్లో దరఖాస్తులు వస్తాయన్నారు.

**వ్యవసాయ రంగాన్నికి ప్రాధాన్యనిస్తాం: నెదర్లాండ్ మాజీ మంత్రి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ''భూ భారతి'' అవగాహన కార్యక్రమంలో అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. మా దేశం (నెదర్లాండ్)లో అక్కడి ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. మా దేశం నుంచే దాదాపు 80శాతం వ్యవసాయరంగ ఉత్పత్తులను ఎగుమతి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరచారి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, అబ్దుల్లాపూర్మెట్ తహసీల్దార్ సుదర్శన్రెడ్డి, ఎంపీడీవో యూ శ్రీవాణి, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

### డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

గౌరెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొత్తకుర్మ



**అబ్దుల్లాపూర్మెట్,మహా:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండల గౌరెల్లి గ్రామంలో డిస్ట్రిక్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ..రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిక సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ పీఏసీఎస్ చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, మానిటరింగ్ ఆఫీసర్ బాలరాజు, నాయకులు చెంచల అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 నియామకాలపై సింగిల్ బెంచ్

# తీర్పును సవాల్ చేసిన టీజీపీఎస్సీ


**రేపు హైకోర్టు సీజే ధర్మాసనం విచారణ**

**మహా :** తెలంగాణలో గ్రూప్ 1 నియామకాలను తాత్కాలికంగా నిలిపి వేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి అందరికీ తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం నియామకాలు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసినట్లు టీజీపీఎస్సీ తరపు న్యాయవాది సింగిల్ బెంచ్‌కు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై సోమవారం జరగాల్సిన విచారణను జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారానికి వాయిదా వేశారు.

## మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు

# సీఎం అయ్యే అర్హత ఉంది

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్**



**మహా :** కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి పోటీ పడే నాయకుల గురించి చర్చ జరగడం సహజం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది సీనియర్ సీఎం పదవి కోసం పోటీ పడ్డారు. చివరకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని అధిష్ఠానం ఖరారు చేసింది. పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న రేవంత్ ప్రజాకర్షణ, వాక్చాతుర్యం, పార్టీ శ్రేణుల్లో ఆయనకున్న పట్టును సానుకూల అంశాలుగా మలుచుకొని సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే రేవంత్ కాకుండా సీఎంగా ఎవరికి అవకాశాలున్నాయనే దానిపై తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు సీఎం అయ్యే అర్హత ఉందని అన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు బ్లాక్ భవన నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి ఈ మేరకు సంచలన కామెంట్స్ చేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ముఖ్యమంత్రి అయ్యే అర్హత 100 శాతం ఉందని చెప్పారు. ఈ ఇద్దరి నాయకత్వంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకుంటున్నామని చెప్పారు. కాగా, గతంలోనూ ఇదే తరహా కామెంట్స్ రాజగోపాల్ రెడ్డి చేశారు. తాజాగా ఆయన చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీశాయి. సమావేశంలో పాల్గొని ప్రసంగించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకే కుటుంబం పదేళ్లు పాలనలో ఉండి రాష్ట్రాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని దివాలా తీయించారని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత లాభాలు పొందారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతలో లోపం రావడం, మూడేళ్లలోనే నిర్మాణాలు ధ్వంసం కావడం నేతల కమీషన్ పాలిటిక్స్ కారణమని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్ఎస్ డీఏ నివేదికలో పేర్కొందని గుర్తు చేశారు.



## హయత్ నగర్ లో దోపిడీ

# దొంగలు రెచ్చిపోయారు

- శివారు ప్రాంతంలో గొర్రెల కాపలా ఉన్న ఇద్దరిపై కత్తులతో దాడి
- గాయపడిన వారిలో ఓ కానిస్టేబుల్

**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** సిటీ శివారులో పశువుల దొంగలు రెచ్చిపోయారు.గొర్రెల మందను టార్గెట్ చేసిన దుండగులు కాపలా ఉన్న ఇద్దరిపై కత్తులతో దాడి చేసి 30 గొర్రెలను దొంగిలించి పారిపోయారు.దుండగులు గొర్రెలను దొంగిలిస్తున్న సమయంలో అడ్డుకున్న గొర్లకాపరిగా ఉన్న ఇద్దరు యువకులకు దోపిడీ దొంగలకు మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ దాడిలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న కానిస్టేబుల్ నవీన్ కి తీవ్ర గాయాలయ్యాయి.కానిస్టేబుల్ నవీన్ తన తండ్రికి ఆరోగ్యం బాగలేకపోవడంతో తన తండ్రి రోజువారిగా కాపలా ఉండే గొర్రెల మంద వద్ద తన బంధువుతో కలిసి కావలిగా ఉన్నాడు. రాత్రి మూడు గంటల సమయంలో దొంగలు గొర్రెల మంద వద్దకు వచ్చి చోరీకి పాల్పడ్డారు.గొర్రెలను దొంగిలించే సమయంలో దొంగలకు,కానిస్టేబుల్ కు మధ్య ఘర్షణ జరిగింది. అదే సమయంలో కానిస్టేబుల్ పై దుండగులు కత్తులతో దాడి చేశారు. బాధితుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కానిస్టేబుల్ నవీన్ తండ్రి ఒంటరిగా ఉండటం గమనించిన దొంగలు పక్కా ప్లాన్ ప్రకారం దోపిడీ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.నేరస్తులను త్వరలో పట్టుకొని.త్వరలో రిమాండ్ కు పంపిస్తామని తెలిపారు.

## కేసీఆర్ డూప్లికేట్ గాంధీ వ్యాఖ్యలపై జగ్గారెడ్డి ఫైర్

- రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదు
- తెలంగాణ ఏర్పాటుకు గాంధీల చుట్టూ తిరిగిన గతం గుర్తుంచుకోవాలని హితవు
- కేసీఆర్ తన గౌరవాన్ని తగ్గించుకోవద్దని సూచన

**మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ తన గతాన్ని పూర్తిగా మర్చిపోయి మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత ఆయనకు లేదని జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభలో గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి కేసీఆర్ 'డూప్లికేట్ గాంధీలు' అని చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "కేసీఆర్ వయసులో పెద్దవారు. మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. రాహుల్ గాంధీ కుటుంబానికి దేశంలో ఓ ప్రత్యేక చరిత్ర ఉంది. వారిపై విమర్శలు చేసి కేసీఆర్ తనకున్న కొద్దిపాటి గౌరవాన్ని కూడా పోగొట్టుకోవద్దు" అని జగ్గారెడ్డి హితవు పలికారు.

# రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ సంస్థాగత భేటీలు

**బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి చర్యలు**

కష్టపడే వారికే పదవులు .. జెండామోసేవారికే గుర్తింపు

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు తాహెర్ బిన్ హందన్, చిట్ల సత్య నారాయణ

సభకు అధ్యక్షత వహించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** త్వరలో పార్టీకి సంబంధించి అన్ని పదవులు నియామక ప్రక్రియ మొదలవుతుందని ,జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు పరిశీలకులు తాహెర్ బిన్ హందన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణులచే రాజ్యాగ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తాహెర్ బిన్ హందన్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో చరిత్ర కలిగిన పార్టీ అని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తల కష్టాల ఫలితమే నేడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉందని 1925లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మహాత్మా గాంధీ అధ్యక్ష పదవి చేపట్టి వంద సంవత్సరాల ఉత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.అందుకే జై బాపు జై భీం జైసంవిధాన్ కార్యక్ర మం చేపట్టినట్టు వివరించారు.అలాగే ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక రాజ్యాంగాన్ని రూపొందిస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు . అందుకే రాజ్యంగ పరిరక్షణ ధ్యేయంగా జై బాబు జై భీమ్ జై సంవిధాన్ యాత్రని మండలాల్లో విస్తృతస్థాయిలో చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.రాజ్యంగ పరిరక్షణ ర్యాలీల ద్వారా బిజెపి ప్రభుత్వం యొక్క కుట్రను ప్రజలకు తెలియజేశామన్నారు .ఎన్నికల్లో సీట్ల కోసం కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో చరిత్ర ఉందని గొప్ప గొప్ప నాయకులకు ఆదిలాబాద్ జిల్లా పుట్టిల్లుగా ఉందని అలాంటి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఖచ్చితంగా మారుతుందన్నారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి ప్రక్షాళన చేసేందుకే జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు అందులో భాగంగానే తమను ఇన్చార్జిలుగా ఇక్కడికి పంపించినట్టు స్పష్టం చేశారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి 10వ తేదీ వరకు మండలాల అధ్యక్షులు ఎంపిక పూర్తి జరుగుతుందన్నారు ప్రతి పదవికి మూడు పేర్లు పరిశీలనలోకి తీసుకొని నాయకులు కార్యకర్తల సూచనల ప్రకారం ఎంపిక ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖచ్చితంగా ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి పునర్ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు .పార్టీ నమ్ముకుని పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందని పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు .పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పుడూ అన్యాయం జరగదన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రతి నాయకుడు కార్యకర్త పార్టీ పట్ల న్యాయంగా వ్యవహరించాలన్నారు. నీతిగా పనిచేయాలన్నారు .పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టాలన్నారు .వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**పునర్ వైభవం రావాలి-చిట్ల సత్యనారాయణ**

అనంతరం టీపీసీసీ కార్యదర్శి పరిశీలకులు చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో పార్టీకి పునర్ వైభవం రావాలంటే బూతు స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో పార్టీ ప్రక్షాళన కోసమే విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశానుసారం జిల్లాలో పార్టీని తిరిగి పటిష్ట స్థితికి చేర్చేందుకు ఈ కార్యక్రమానికి వచ్చినట్టు ఆయన తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు .స్థానిక సంస్థల ఎన్నికలు , జిల్లాలో పార్టీ పునర్ వైభవం కోసం పార్టీ ప్రక్షాళన చేపడుతుందన్నారు.ఇందుకోసం ప్రతి జిల్లాకు ఇద్దరు పరిశీలకులను పార్టీ అధిష్టానం పంపినట్టు ఆయన తెలిపారు .కష్టపడి పని చేసే కార్యకర్తలను పార్టీ ఎప్పటికైనా గుర్తిస్తుందని ఓపికగా పార్టీ కోసం పని చేయాలని ఆయన తెలిపారు .జిల్లాలోని అన్ని మండలాలలో పదవులకు సమర్థులైనటువంటి కార్యకర్తల పేర్లను పరిశీలనలోకి తీసుకొని వాటిని అధిష్టానానికి పంపుతామన్నారు .కార్యకర్తల రెక్కల కష్టమే తెలంగాణలో ప్రజా పాలన కొనసాగటానికి కారణమన్నారు. సమావేశంలో పలువురు కార్యకర్తల అభిప్రాయాలు ఆవేదనలు సూచనలు సలహాలు అన్ని కూడా పార్టీ అధిష్టానానికి నివేదిస్తామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదానీ అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. కులం మతం పేరుతో చిచ్చు పెడుతుందన్నారు .ఉన్న ఆస్తులు అమ్ముకుంటూ పాలన కొనసాగించే వీరు ప్రభుత్వాన్ని ఏం నడుపుతారన్నారు .ప్రతి వ్యక్తి ఖాతాలో 15 లక్షలు వేస్తానన్న మోడీ హామీ ఏమైందని నిలదీశారు . భారత రాజ్యాంగాన్ని మార్చేసే కుట్ర బిజెపి చేస్తోందని అందుకే రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బీపు జై భీమ్ యాత్రల ఉద్దేశం అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామనడం రాజ్యాంగ రచన చేసిన అంబేద్కర్ మహనీయున్ని అవమానించడం బిజెపి నైజం అన్నారు. ఓట్లు సాధించేందుకు గెలిచేందుకు బిజెపి ఎన్ని మాయ మాటలు అని చెప్తుందన్నారు. ఇక నిన్నటి బిఆర్ఎస్ సభ గురించి ఆయన మాట్లాడుతూ వెయ్యి మంది కేసీఆర్లు వెయ్యి మంది కేటీఆర్ లు వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఏమి చేయలేరన్నారు. మోసం చేయటం మాట మార్చడం కేసీఆర్ కు అలవాటన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తా అన్న కేసీఆర్ మాట ఏమైందని ప్రశ్నించారు. వేల కోట్లు వెనకేసుకుని ఫామ్ హౌస్ లో కూర్చున్నారన్నారు. దోచుకోవటం దాచుకోవటమే టిఆర్ఎస్ పార్టీ నైజ అన్నారు .సభకు వచ్చిన జనాన్ని చూసి వారు సంబరపడుతున్నారని వారంతా డబ్బులు ఇచ్చి తెచ్చుకున్న ప్రజలని ఎద్దేవా చేసారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదన్నారు .ఎన్ని శక్తులేకమైన కాంగ్రెస్ పార్టీని ఏమి చేయలేదన్నారు. మరో 15 సంవత్సరాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుదన్నారు. మనస్పర్థలు పక్కనపెట్టి ప్రతి నాయకుడు కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని ఆయన సూచించారు.




**ఎన్నిక ఏదైనా గెలుపే లక్ష్యం**

**- కంది శ్రీనివాస రెడ్డి**

పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని సభకు అధ్యక్షత వహించిన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోతున్నాయన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల మన ముందున్న లక్ష్యమని ఎట్టి పరిస్థితిలో అనుకున్న దానికంటే ఎక్కువ సీట్లు సాధించాలన్నారు.మండల గ్రామ బూత్ స్థాయిలో నాయకులు కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యంగా ప్రతిఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. వచ్చే ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించేలా అంతా కలిసి కష్ట పడుదామని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు.

## భూభారతి సదస్సు కు హాజరైన ఉర్దూ అకాడమీ చైర్మన్



**ఆదిలాబాద్ మహా :** ప్రజలు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చట్టాలను మార్పు చేయాల్సిన అవసరం ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి చట్టంతో ఏం జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. కొత్త భూభారతి చట్టం గురించి జిల్లా , మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.భూ భారతి చట్టం పై రైతులు అవగాహన కల్పించుకొని అధికారులకు సహకరించాలని, మండలం, గ్రామాల్లో అధికారులు పర్యవేక్షించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.అనంతరం ఢిల్లీలో ప్రధాన మంత్రి చే అవార్డు అందుకున్నసందర్భంగా జిల్లా కలెక్టర్ ను తాహెబిన్ హందన్ ,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శాలువాలతో సత్కరించారు.



**కంది శ్రీనివాస రెడ్డి నివాసాన్ని సందర్శించిన ఉర్దూ అకాడమీ చైర్మన్**

**ఆదిలాబాద్ :** జిల్లాలోని తాంసి మండల కేంద్రంలో జరిగిన భూభారతి సదస్సుకు హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ కార్యక్రమ అనంతరం హస్నాపూర్ గ్రామంలోని కంది శ్రీనివాస రెడ్డి నివాసాన్ని సందర్శించారు. కంది శ్రీనివాస రెడ్డి తో పాటు ఆయన కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు.కుటుంబ సభ్యులతో కలిసి చైర్మన్ తేనీటి విందు స్వీకరించారు.అనంతరం తమ గ్రామానికి వచ్చిన తాహెర్ బిన్ హందన్ ను గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ,హస్నాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా భూధార్

మార్పులు చేర్పులు, సాదా బైనామా సేవలు సులభతరం.. జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేందుకే భూ భారతి చట్టం 2025 ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కందుకూర్ లోని టంకరీ రాంరెడ్డి ఫంక్షన్ హోలు నందు ఏర్పాటు చేసిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాల్గొన్నారు. భూ భారతి అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా ఆ వివరాలను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి రైతులకు ప్రజలకు వివరంగా చదివి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు



తమ భూముల విషయం లో ఉన్న అభద్రత భావాన్ని తొలగించి, జవాబుదారు తనాన్ని పెంచేందుకు ప్రభుత్వం భూ భారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, నిషేధిత భూములు, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించడం జరిగిందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజల వద్దకు అధికారులే వచ్చి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదా బైనమాలు, పాసు పుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా 'భూధార్'ను రూపొందించనున్నట్లు తెలిపారు.




## తెలుగు రాష్ట్రాల్లో జియో ఎయిర్ ఫైబర్ జోరు

**హైదరాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జియో ఎయిర్ ఫైబర్ సేవల ద్వారా 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (FWA) విభాగంలో జియో తన ఆధిపత్యాన్ని మరింత బల పరుచుకుంది. భారత టెలికాం నియంత్రణ సంస్థ (TRAI) ఫిబ్రవరి 2025కి విడుదల చేసిన తాజా డేటా ప్రకారం.. జియో తెలుగు రాష్ట్రాల్లో 5జీ ఎఫ్‌డబ్ల్యుఏ విభాగంలో అత్యధిక మార్కెట్ షేర్‌ను సంపాదించింది. ఈ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)లో జియో ఎయిర్‌ఫైబర్ యాక్టివ్ సబ్‌స్క్రైబర్‌లు 2025 జనవరిలో 4,27,439 ఉండగా ఫిబ్రవరిలో 4,58,372 మందికి పెరిగారు. భారతీ ఎయిర్‌టెల్ సబ్‌స్క్రైబర్‌లు ఫిబ్రవరిలో 95,164 మంది మాత్రమే ఉన్నారు. అంటే.. 84% మార్కెట్ వాటా, అద్భుతమైన పనితీరుతో ఈ విభాగంలో జియో తన పోటీదారుల కంటే 5 రెట్లు ఎక్కువగా సబ్‌స్క్రైబర్ బేస్‌ను సంపాదించుకుంది. తన 5జీ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయడం, అందుబాటులో ఉన్న ప్లాన్లను అందించడం.. సులభమైన కస్టమర్ అనుభవాన్ని కల్పించడం ద్వారా జియో ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రత్యేకంగా గ్రామీణ, నగర ప్రాంతాలలో ఎన్నో సవాళ్లను అధిగమించి మారు మూల ప్రాంతాలకు సైతం హై స్పీడ్ కనెక్టివిటీని జియో అందిస్తోంది. ఆప్టికల్ ఫైబర్ (జియో ఫైబర్) విస్తరించలేని చోట్ల ప్రతి ఇల్లు మరియు చిన్న వ్యాపారానికి.. గృహ వినోదం, బ్రాడ్‌బ్యాండ్ సేవలను జియో ఎయిర్ ఫైబర్ అందుబాటులోకి తెచ్చింది.

జియో ఎయిర్ ఫైబర్.. 800కి పైగా డిజిటల్ టీవీ ఛానళ్ళు, 11కి పైగా ఓటీటీ యాప్‌లు, నిరంతరాయంగా వైఫై, స్మార్ట్ హోమ్ సర్వీస్, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో ప్రపంచ స్థాయి హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోంది. వివిధ వయస్సుల.. నేపథ్యాల నుంచి వినియోగదారులు ఇప్పుడు నిరవధిక హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ & ప్రపంచ స్థాయి హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను పొందుతూ డిజిటల్ ఇండియా ప్రయోజనాలను నిజంగా అనుభవిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వందలాది చిన్న, పెద్ద పట్టణాలు, వేలాది గ్రామాల్లో జియో ఎయిర్ ఫైబర్ డిజిటల్ ప్రాణశక్తిగా మారింది.


## సొంతంగా స్టార్టప్.. కుమార్తెపై బిల్‌గేట్స్ ప్రశంసల వర్షం



తల్లిదండ్రులు ఎంత సంపాదించినా.. వారి ఆస్తి నుంచి చిల్లిగవ్వ తీసుకోకుండా ఎదిగేవాళ్ళు చాలా తక్కువమందే ఉంటారు. ఇలాంటి కోవకు చెందిన వారిలో ఒకరు.. బిల్‌గేట్స్ కుమార్తె 'ఫోబ్ గేట్స్' (Phoebe Gates). ఈమె తండ్రిపై ఆధారపడకుండానే.. సొంతంగా స్టార్టప్ కోసం నిధులను సమకూర్చుకుంది. ఇది తనకు చాలా సంతోషంగా ఉందని టెక్ బిలియనీర్ న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తన కుమార్తె ఫోబ్ గేట్స్.. తన స్టార్టప్ కోసం నిధులను సేకరించే క్రమంలో, తన దగ్గరకు వస్తుందని నేను ఊహించాను. ఒకవేళ తను నన్ను సహాయం చేయమని అడిగి ఉంటే.. తప్పకుండా చేసేవాణ్ణి. అయితే కొన్ని షరతులు కూడా పెట్టేవాడినని బిల్‌గేట్స్ అన్నారు. అయితే నిధుల కోసం నన్ను సంప్రదించకుండా.. సొంతంగా సమకూర్చుకున్న కూతురిపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. 22 ఏళ్ల ఫోబ్ గేట్స్.. తన స్నేహితురాలు సోఫియా కియానీతో కలిసి 'ఫియా' అనే స్టార్టప్ ప్రారంభించారు. ఇది ఒక సిజిటల్ ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్. ఇందులో సుమారు 40,000 కంటే ఎక్కువ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్న దుస్తుల ధరలను వెల్లడిస్తుంది. వినియోగదారులకు ఫ్యాషన్ ఉత్పత్తుల మీద బెస్ట్ డీల్స్ అందించడంతో పాటు.. ఆన్‌లైన్ షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరచడమే దీని ప్రధాన లక్ష్యం. 2024లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన.. ఫోబ్ గేట్స్ తన స్టార్టప్ కోసం వెంచర్ క్యాపిటలిస్టులు & ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి సుమారు 500000 డాలర్ల కంటే ఎక్కువ నిధులను సేకరించింది. సుమారు 102.2 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తన తండ్రి బిల్‌గేట్స్ సహాయం పొందకుండా.. స్టార్టప్ ప్రారంభించడం గొప్ప విషయం అని పలువు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బిల్ గేట్స్ తన మాజీ భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్ తో ముగ్గురు పిల్లలను కన్నారు. వారు జెన్నిఫర్ (28), రోరీ (25), ఫోబ్.

### నాలుగు రోజులు సెలవు పెట్టాను

## హెచ్‌ఆర్ కాల్ చేసి..



జాబ్ చేసేవారు తమ ఉద్యోగ కష్టాలు.. ఆఫీసులో ఎదురయ్యే అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు మొదలైనవన్నీ చెప్పుకోవడానికి రెడ్డిట్ ఓ మంచి వేదికగా మారింది. ఇందులో భాగంగానే ఒక వ్యక్తి.. తాను ఆఫీసులో ఎదుర్కొంటున్న కష్టాలను షేర్ చేశారు. నేను పనిచేసే కంపెనీలో.. ఆదివారం మాత్రమే సెలవు ఉంటుంది. అయితే కొన్నిసార్లు ఆదివారాల్లో కూడా ఐదు గంటల నుంచి ఆరు గంటలు పనిచేయాలని మేనేజర్ పేర్కొంటారు. ఇటీవల నేను నాలుగు రోజులు సెలవు కావాలని అడిగాను, చాలా చర్చలు జరిపిన తరువాత సెలవు మంజూరు చేశారు. సెలవులు ఇచ్చారు, కానీ.. సమయం దొరికినప్పుడల్లా ఆఫీస్ వర్క్ చేయాలని మేనేజర్ చెప్పారు. కానీ ఆ సమయంలో పని చేయడం కష్టమవుతుందని, వీలైతే చేస్తానని నేను (ఉద్యోగి) చెప్పాను. అయితే సెలవుల సమయంలో వర్క్ చేయలేకపోయాను. సెలవుల తరువాత నేను ఆఫీసుకి తిరిగి వచ్చాను. ఆ రోజు సాయంత్రానికే.. నా పనితీరు తక్కువగా ఉందని, నన్ను పీఐపీ( పర్ఫామెన్స్ ఇంప్రూమెంట్ ప్లాన్)లో ఉంచినట్లు హెచ్‌ఆర్ నుంచి కాల్ వచ్చింది. దీనికి కారణం సెలవుల్లో పనిచేయకపోవడమే అని నాకు అర్థమైంది. ఇది నన్ను చాలా గందరగోళానికి గురిచేసింది. చట్టబద్ధంగా ఇది ఎలా జరుగుతుందో నాకు అర్థం కాలేదు? సంస్థలకు తాము చేయగలిగింది చేయగలిగేంత అధికారం ఉందా?..ఈ చర్యలను ఎదుర్కోవడానికి తగిన పరిష్కారం ఉందా.. అని పోస్ట్ చేశారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కంపెనీ, మేనేజర్ పేరు చెప్పి అవమానించండి అని ఒకరు అన్నారు. చాలా కంపెనీలలో ఇలాగే జరుగుతోందని ఇంకొకరు అన్నారు. హెచ్‌ఆర్‌ను మీకు ఈ మెయిల్ చేయమని చెప్పండి అని మరొకరు అన్నారు. ఇలా ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు సలహాలు ఇచ్చారు.




## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం లాభాల్లో మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,005.84 పాయింట్లు లేదా 1.27 శాతం లాభంతో 80,218.37 వద్ద, నిఫ్టీ 272.90 పాయింట్లు లేదా 1.14 శాతం లాభంతో 24,312.25 వద్ద నిలిచాయి. జయస్వాల్ నెకో ఇండస్ట్రీస్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, ఓరియంటల్ ట్రైమెక్స్, సౌత్ వెస్ట్ పినాకిల్ ఎక్స్‌ప్లోరేషన్, బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. లాయిడ్స్ ఇంజనీరింగ్ వర్క్స్, తేజస్ నెట్‌వర్క్స్, అసోసియేటెడ్ ఆల్కహాల్ అండ్ బ్రూవరీస్, ఎస్ఎమ్ఎల్ ఇసుజు, అవంటెల్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.




# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



## ఎవరీ తేజ్‌పాల్ భాటియా..?

### చారిత్రాత్మక అంతరిక్ష మిషన్‌కు ముందు..




ఇస్రో, నాసా కలిసి చారిత్రాత్మక అంతరిక్ష మిషన్‌ను కొన్ని వారాల్లో ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. పైగా ఈ ఆక్సియం 4 మిషన్‌కి పైలట్‌గా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా వ్యవహరించనున్నారు. సరిగ్గా ఈ చారిత్రాత్మక మిషన్‌కి ముందు ఆక్సియమ్ స్పేస్ నాయకత్వంలో అనుహ్యంగా మార్పులు చోటుచేసుకున్నాయి. అదికూడా మన భారత సంతతి వ్యక్తే నియమాకం కావడం విశేషం. అతనెవరు..? ఎలా ఈ అవకాశం వరించింది అంటే..! ఇస్రో నాసో చారితత్రాత్మక మిషన్ ముందు ప్రధాన నాయకత్వంలో మార్పులు చేసింది ఆక్సియమ్ స్పేస్. కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా భారత సంతతికి చెందిన ఎగ్జిక్యూటివ్ తేజ్‌పాల్ భాటియాను నియమిస్తున్నట్లు ప్రకటించింది. గత నాలుగేళ్లుగా కంపెనీకి చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేసిన భాటియా మునుపటి సీఈవో, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అండ్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ కామ్ గఫారియన్ స్థానంలోకి రానున్నారు. ఇక గఫారియన్ ఆక్సియమ్ స్పేస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగనున్నారు. ఆక్సియమ్ ఆక్స్4 మిషన్‌లో భారతీయ వ్యోమగామిని ప్రారంభించటానికి ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. నిజానికి ఈ మిషన్‌ని భారతదేశం మానవ అంతరిక్ష ప్రయాణానికి కొత్త యుగంలోకి ప్రవేశించేలా చేసే గొప్ప సహకారంగా పేర్కొనవచ్చు. పైగా ఇది ఐఎస్ఎస్‌కి నాల్గవ ప్రైవేట్ వ్యోమగామి మిషన్.

### భాటియా ఎవరంటే..

2021లో గూగుల్ నుంచి ఆక్సియం స్పేస్‌లో చేరినప్పటి నుంచి భాటియా ఎన్నో మైలురాయి ఒప్పందాలు, మిషన్‌లకు మార్గదర్శకత్వం వహించారు. ముఖ్యంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వాణిజ్య మానవ అంతరిక్ష విమాన మిషన్ల పరిశ్రమకి సంబంధించిన మొట్టమొదటి సార్వభౌమ ప్రభుత్వ కొనుగోళ్లకు నాయకత్వం వహించారు. అందులో ఆక్సియం మిషన్-4 సంచలనాత్మక ఆక్సియం మిషన్-1(Ax-1) కూడా ఉంది. ఆయన ఆర్టెమిస్ III చంద్ర మిషన్ కోసం తదుపరి తరం స్పేస్‌సూట్‌లపై ప్రాడాతో భాగస్వామ్యం, చంద్ర అన్వేషణ స్పేస్‌సూట్‌లలో హై-స్పీడ్ సెల్యులార్ కనెక్టివిటీని ఏకీకృతం చేసేందుకు నోకియాతో కలిసి అధిక-ప్రభావ క్రాస్-ఇండస్ట్రీ సహకారాలు తదితరాలను పర్యవేక్షించారు. అలాగే ఆక్సియం స్పేస్‌ని నెలకొల్పి మానవ అంతరిక్ష పరిశోధన కోసం ప్రముఖ ఆవిష్కర్తగానూ, వాణిజ్య సమగ్రకర్తగానూ ఉన్నారు. ఈ మేరకు భాటియా మాట్లాడుతూ.. చిన్నటి నుంచి అంతరిక్ష అన్వేషణ ద్వారా స్ఫూర్తి పొందాను. ఆ క్రమంలో ఈ ఆక్సియమ్ స్పేస్‌ను నడిపించగలిగానని, అదే తన జీవతాశయాంలోని కీలక మలుపు అని అన్నారు. తాము తదుపరి సాంకేతికతలలో స్పేస్‌సూట్‌లు, ఆర్బిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మైక్రోగ్రావిటీ పరిశోధన, తదితరాలలో పెట్టుబడులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అంతరిక్షంలో మానవాళి భవిష్యత్తును నిర్మించడంలో సహాయం చేసేందుకు మరింతమంది చురుకైన సాంకేతిక నిపుణులు, దూరదృష్టిగల ఇంజనీర్లు, వ్యవస్థాపకులు కావాలని అన్నారు. ఇక భాటియా దీనిలో ఫార్చ్యూన్ 100 ఎగ్జిక్యూటివ్‌లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులను నిమగ్నం చేశాడు. పైగా రూ. 400 కోట్లకు పైగా అమ్మకాలకు మద్దతిచ్చాడు. అలాగే ఆక్సియం ఆలోచనలను వాస్తవ రూపంలోకి మార్చడంలో భాటియా అత్యంత కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు మాజీ సీఈవో కామ్ గఫారియన్.

## స్తంభించిన విద్యుత్

### మూడు దేశాలు అతలాకుతలం



**మాడ్రిడ్:** విద్యుత్ సప్లై పూర్తిగా నిలిచిపోవడంతో మూడు ఐరోపా దేశాలు అతలాకుతలమవుతున్నాయి. పవర్ గ్రిడ్ లో తీవ్రమైన సమస్యలు తలెత్తడంతో స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్ దేశాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రస్తుతం పవర్ గ్రిడ్ తిరిగి పునరుద్ధరించే పనిలో పడ్డ మూడు దేశాలు.. సోమవారమంతా చీకటిలో మగ్గిపోయాయి. విమానాల రాకపోకల్లో తీవ్ర సమస్యలే కాకుండా భారీ ట్రాఫిక్ జామ్ లు వంటి ఘటనలు ఆ దేశాల్లో తలెత్తాయి. దీనిపై ఆయా దేశాలు అత్యవసరంగా క్యాబినెట్ భేటీ నిర్వహించి పవర్ గ్రిడ్ ను పునరుద్ధరించేందుకు కసరత్తులు చేస్తున్నాయి.

**ఎక్కడికక్కడే నిలిచిపోయిన రైళ్లు..**

చిమ్మ చీకటిలో గడుపుతున్న ఈ మూడు దేశాల్లో మెట్రో సేవలు ఉన్నపళంగా నిలిచిపోయాయి. . రైళ్లు కూడా ఎక్కడికక్కడి స్తంభించిపోయాయి. . దీంతో ఆయా దేశాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభంపై ఇప్పటివరకూ ఎటువంటి క్లారిటీ లేకపోవడంతో జనాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మాడ్రిడ్ లోని నాలుగు టవర్ బిల్డింగ్ ల్లో ఒక దాన్ని ఖాళీ చేయించారు. ఇందులో బ్రిటీష్ ఎంబాసీ పనిచేస్తున్న దరిమిలా ఆ కార్యాలయాన్ని ఆకస్మింగా ఖాళీ చేయించారు.

### ఆఫీసులు వదిలి రోడ్లపైనే...

తీవ్రమైన విద్యుత్ సంక్షోభంతో కార్యాలయాలు ఏవీ పని చేయడం లేదు. ఆఫీసులకు వచ్చిన ఉద్యోగులు.. రోడ్లపైనే తిరుగుతూ కాలయాపన చేస్తున్నారు. అయితే దీనిపై స్పానిష్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్ ఆపరేట్ రెడ్ ఎలక్ట్రికా స్పందించింది. విద్యుత్ ను తిరిగి పునరుద్ధరించే క్రమంలో స్థానిక విద్యుత్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. అన్ని యూరోపియన్ విద్యుత్ యూనియన్లను సమన్వయం చేసుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు తాత్కాలిక ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది.



### ఉక్రెయిన్‌లో రష్యా తాత్కాలిక

## కాల్పుల విరమణ

**మాస్కో:** ఉక్రెయిన్‌లో రష్యా తాత్కాలిక కాల్పుల విరమణను ప్రకటించింది. విక్టరీ డే నేపథ్యంలో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీవరకు పూర్తిస్థాయి కాల్పుల విరమణ పాటిస్తామని క్రెమ్లిన్ వెల్లడించింది. మానవతా దృక్పథంతో దేశాధ్యక్షుడు పుతిన్ ఈమేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ ప్రకటన వెలువడింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ప్రభుత్వం ఏటా మే 9న విక్టరీ డే వేడుకలు నిర్వహిస్తుంది. అమెరికా నుంచి శాశ్వత కాల్పుల విరమణ, శాంతి చర్చల ఒప్పందంపై ఒత్తిడి పెరుగుతున్న వేళ.. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ నిర్ణయం ప్రకటించారు. ఇదిలా ఉంటే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ మీద దాడులు ఆపాలంటూ రష్యాను కోరిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా బలగాలు జరుపుతున్న భీకరదాడులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారాయన. అదే సమయంలో.. శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాను వదులుకోవాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీకి సూచించారు కూడా.

### ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

## విచారణ వాయిదా



**ఢిల్లీ:** సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. సోమవారం సుప్రీంకోర్టులో ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పార్థివాల, జస్టిస్ మహాదేవన్ ధర్మాసనం విచారించింది. విచారణలో భాగంగా సీఐడీ దర్యాప్తుకు హాజరయ్యామని మిథున్ రెడ్డి తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, నిరంజన్ రెడ్డిలు తెలిపారు. మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్ కేసులో ఏపీ సిఐడి దాఖలు చేసిన కౌంటర్‌పై.. కౌంటర్‌ను పరిశీలించి రిజైన్డర్ దాఖలు చేసేందుకు మిథున్ రెడ్డి తరఫు న్యాయవాదులు సమయం కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పార్థివాల, జస్టిస్ మహాదేవన్ ధర్మాసనం.. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటి వరకు మిథున్ రెడ్డిని అరెస్టు చేయొద్దని ఆదేశించింది.

# డ్రాగన్‌తో హిట్..

## క్రేజీ ఛాన్స్ కొట్టేసిన కాయదు

కొన్నిసార్లు ఒక్క సినిమాతో హీరోయిన్లు ఓవర్ నైట్ స్టార్స్ అయిపోతుంటారు. అలా కొన్నిరోజుల క్రితం రిలీజైన 'డ్రాగన్'తో కాయదు లోహర్ స్టార్ అయిపోయిందని చెప్పొచ్చు. ఇప్పటికే తెలుగులో ఓ ఆఫర్ దక్కించుకున్న ఈమె ఇప్పుడు మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది. అసోంకు చెందిన కాయదు లోహర్.. 'అల్లూరి' అనే తెలుగు సినిమాతో హీరోయిన్ అయింది. కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. దీంతో తమిళంలో ప్రయత్నించగా.. ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్'లో అవకాశమొచ్చింది. ఇదే మూవీతో కాయదుకు మంచి క్రేజ్ కూడా వచ్చింది. ఈ క్రమంలోనే తెలుగులో విశ్వక్ సేన్‌అనుదీప్ కాంబోలో తీస్తున్న 'ఫంకీ'లో కాయదు హీరోయిన్ గా సెలెక్ట్ కాగా.. ఇప్పుడు తమిళ హీరో శింబు సరసన నటించే అవకాశం కూడా దక్కింది. ఈ మేరకు అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీస్ కూడా హిట్ అయితే ఇండస్ట్రీలో కాయదు లైఫ్ సెట్ అయిపోయినట్లే!



# అద్దె అపార్ట్‌మెంట్‌లోనే విక్కీ కౌశల్..

## వామ్మో రెంట్ మరీ ఇంతనా..



ప్రముఖ బాలీవుడ్ నటుడు 'విక్కీ కౌశల్' ముంబైలోని జుహు ప్రాంతంలోని విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్ లీజును పునరుద్ధరించారు. నెలవారీ అద్దె ఇంతకు ముందు చెల్లిస్తున్నదాని కంటే ఎక్కువైంది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ (IGR) వెబ్‌సైట్ ద్వారా స్క్వేర్ యార్డ్స్ సమీక్షించిన ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. విక్కీ కౌశల్ నెలవారీ అద్దె రూ. 17.01 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. మూడు సంవత్సరాల లీజు లావాదేవీ అధికారికంగా ఏప్రిల్ 2025లో నమోదు నమోదు చేశారు. జనవరి 2025 నుంచి ప్రారంభమయ్యే ప్రస్తుత మూడు సంవత్సరాల లీజు ఒప్పందంలో.. మొదటి, రెండవ సంవత్సరాలకు నెలవారీ అద్దె రూ.17.01 లక్షలు ఉంటుంది. మూడో సంవత్సరంలో ఇది రూ.17.86 లక్షలకు పెరుగుతుంది. లీజు వ్యవధిలో,విక్కీ కౌశల్ చెల్లించే మొత్తం అద్దె సుమారు రూ.6.2 కోట్లకు చేరుకుంటుందని అంచనా. దీనిపై విక్కీ కౌశల్ అధికారికంగా స్పందించలేదు. 2021 జులైలో నెలవారీ అద్దె రూ.8 లక్షల నుంచి ప్రారంభమైంది. ఇప్పుడు అద్దె రెట్టింపు అయింది. లీజుకు సంబంధించిన నివేదికల ప్రకారం, విక్కీ కౌశల్ అపార్ట్‌మెంట్ రాజ్ మహల్‌లో ఉంది. ఇది ఒక రెడీటుమూవ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్. స్క్వేర్ యార్డ్స్ రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. అపార్ట్‌మెంట్ 258.48 చదరపు మీటర్ల కార్పెట్ ఏరియాను కలిగి ఉంది. దీనితో పాటు మూడు కార్ పార్కింగ్ స్థలాలు లభిస్తాయి. ఈ లావాదేవీలకు నటుడు రూ. 1.69 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లింపు, రూ. 1,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు, రూ. 1.75 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్ వంటివి చెల్లించినట్లు సమాచారం.



# శ్రీ విష్ణు సింగిల్ ట్రైలర్ రిలీజ్..

తెలుగు హీరోల్లో శ్రీ విష్ణు కాస్త డిఫరెంట్ మూవీస్ చేస్తూ అలరిస్తుంటాడు. గతేడాది 'స్వాగ్' అనే ప్రయోగాత్మక సినిమా చేశాడు. కానీ ఇది జనాలకు నచ్చలేదు. దీంతో తనకు అచ్చొచ్చిన కామెడీనే మళ్లీ నమ్ముకున్నాడు. అలా చేసిన మూవీ 'సింగిల్'. మే 9న రిలీజ్ కాబోతున్న ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ సినిమా ట్రైలర్ ని తాజాగా రిలీజ్ చేశారు. దీనిబట్టి చూస్తే.. సింగిల్ గా ఉండే శ్రీ విష్ణు జీవితంలోకి ఇద్దరమ్మాయిలు వస్తారు. తర్వాత వాళ్లతో ప్రేమ, రొమాన్స్, గొడవలు.. చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్ లో కామెడీ బాగుంది. జోకులు బాగానే పేలాయి. చూస్తుంటే శ్రీ విష్ణు మరో హిట్ కొడతాడేమో అనిపిస్తుంది. రీసెంట్ గా వైరల్ అయిన బుల్లిరాజు అలియాస్ రేవంత్ ఈ సినిమాలోనూ నటించాడు. గీతా ఆర్ట్స్ సంస్థ దీన్ని నిర్మించగా.. కార్తీక్ రాజ్ దర్శకుడు. కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లు.

# క్యాన్సర్‌తో ప్రముఖ దర్శకుడు కన్నుమూత

ప్రముఖ మలయాళీ దర్శకుడు షాజీ కరుణ్ (73) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతున్న ఈయన.. సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలోనే పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 1952లో పుట్టిన ఈయన.. సినిమాటోగ్రాఫర్ గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడిగా మారారు. మోహన్ లాల్ తో 'వానప్రస్థం' సినిమా ఈయనకు చాలా పేరు తీసుకొచ్చింది. అలానే పిరవి మూవీతో జాతీయ అవార్డులు సైతం అందుకున్నారు. 2011లో ఈయన్ని కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డ్ తో సత్కరించింది. ఈయన తీసిన సినిమాల్లో పిరవి, స్వాహం, వానప్రస్థం, నిషాద్, కుట్టి శ్రృంఖు, స్వప్నం.. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ దక్కించుకున్నాయి. అలాంటి ఈయన ఇప్పుడు మృతి చెందడంతో సినీ ప్రముఖులు షాజీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.



## క్రీడా వార్తలు | SPORTS NEWS

# చరిత్ర సృష్టించిన సూర్యవంశీ ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా

ఐపీఎల్ 2025లో జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. 210 భారీ లక్ష్య ఛేధనలో 14 ఏళ్ల చిచ్చరపిడుగు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో వైభవ్ సిక్సర్ల వర్షం కురిపించాడు. మహ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ, ప్రసిద్ధ్ కృష్ణ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లను సూర్యవంశీ ఊతికారేశాడు. అతడిని ఆపడం ఎవరి తరం కాలేదు. ఈ క్రమంలో వైభవ్ కేవలం 35 బంతుల్లోనే తన ఐపీఎల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో 101 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడి ఇన్నింగ్స్‌కు ప్రత్యర్థి ఆటగాళ్లు సైతం ఫిదా అయిపోయారు. సూర్యవంశీ ఔటై పెవిలియన్‌కు వెళ్తుండగా స్టేడియంలో అందరూ నిలిచి స్టాండింగ్ ఓవియేషన్ ఇచ్చారు. ఇక మెరుపు సెంచరీతో చెలరేగిన సూర్యవంశీ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

### సూర్యవంశీ సాధించిన రికార్డులు ఇవే..

- ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఇండియన్ ప్లేయర్‌గా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఇంతకు ముందు ఈ రికార్డు భారత మాజీ ప్లేయర్ యూసఫ్ పఠాన్ పేరిట ఉండేది. 2010 సీజన్‌లో ముంబై పై రాజస్తాన్ తరపున యూసఫ్ 37 బంతుల్లో శతకం సాధించాడు. తాజా మ్యాచ్‌లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన సూర్యవంశీ.. యూసుఫ్ ఆల్‌టైమ్ రికార్డును బ్రేక్ చేశాడు.
- ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన రెండో ప్లేయర్‌గా వైభవ్ నిలిచాడు. ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన జాబితాలో క్రిస్ గేల్ (30 బంతులు) ఉన్నాడు.
- అదేవిధంగా టీ20 క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డులెక్కాడు. వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ల 32 రోజుల వయస్సులో ఈ ఫీట్‌ను అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు మహారాష్ట్ర ప్లేయర్ విజయ్ జోల్ (18 సంవత్సరాల 118 రోజులు) పేరిట ఉండేది.ఈ మ్యాచ్‌తో జోల్‌ను వైభవ్ అధిగమించాడు. అదేవిధంగా ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీ, సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడు కూడా వైభవే కావడం విశేషం.

### టీ20ల్లో సెంచరీ చేసిన పిన్న వయస్కులు వీరే..

వైభవ్ సూర్యవంశీ (14 సంవత్సరాల 32 రోజులు)
విజయ్ జోల్ (18 సంవత్సరాల 118 రోజులు)
పర్వేజ్ హొస్సేన్ ఎమోన్ (18 సంవత్సరాలు 179 రోజులు)
గుస్తావ్ మెక్‌కీన్ (18 సంవత్సరాల 280 రోజులు )





# సూర్యవంశీ ఊచకోత

## గుజరాత్‌కు రాజస్తాన్ షాక్

ఐపీఎల్ 2025లో జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ జూలు విధిల్చింది. ఈ మ్యాచ్‌లో గుజరాత్‌ను 8 వికెట్ల తేడాతో రాజస్తాన్ చిత్తు చేసింది. ఈ విజయంతో రాజస్తాన్ తమ ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని రాజస్తాన్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 15.5 ఓవర్లలో చేధించింది. రాజస్తాన్ బ్యాటర్లలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 35 బంతుల్లోనే తొలి ఐపీఎల్ సెంచరీని అందుకున్నాడు. ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా 14 ఏళ్ల వైభవ్ రికార్డులకెక్కాడు. ఓవరాల్‌గా 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో 101 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు యశస్వి జైశ్వాల్ (40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70 నాటౌట్) సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. గుజరాత్ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. ప్రసిద్ధ్, రషీద్ ఖాన్ మాత్రమే చెరో వికెట్ సాధించారు.

**గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్..**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో శుబ్‌మన్ గిల్ మరోసారి తన బ్యాట్‌కు పని చెప్పాడు. 50 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌ల తో 84 పరుగులు చేసి గిల్ ఔటయ్యాడు. అతడితో పాటు బట్లర్ (50), సాయిసుదర్శన్ (39) రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో థీక్షణ రెండు, అర్చర్, సందీప్ శర్మ తలా వికెట్ సాధించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com